ప్రజాశక్తి

ఆదివారం 15 అక్టోబర్ 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

పులిచింతలపైనే ఆశలు

సాగు నీరందక తెనాలి మండలంలో నెర్రెలిచ్చిన వరిపొలం

- డెల్టాకు అరకొరగా నీటి సరఫరా
- కాల్వలకు సగానికి సగం తగ్గుదల
- వరి ఎండిపోతోందని రైతుల గగ్గోలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

జిల్లాలో అవసరం మేరకు వర్షాలు లేకపోవడం, కాల్వలకు చాలినంత నీటి సరఫరా లేక కృష్ణా డెల్టాలో సేద్యానికి ఈఏడాది నీటికొరత తీవ్ర రూపం దాలుస్తోంది. వరిపైరు పొట్టదశకు చేరుకుంటున్న సమయంలో నీటి సరఫరా సగానికి సగం తగ్గించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నీటి యాజమాన్య నిర్వహణ, తగిన ప్రణాళిక లేక ఏ ప్రాంతానికి పూర్తిస్థాయిలో నీరు సరఫరా కాని పరిస్థితి ఏర్పడుతోంది. పట్టిసీమ నుంచి నీటి సరఫరా తగ్గడం, పులిచింతలలో నీటి నిల్వలు పూర్తిగా లేకపోవడంతో ప్రకాశం బ్యారేజికి సరఫరా తగ్గింది. శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రకాశం బ్యారేజికి 6925 క్యూసెక్కులు మాత్రమే వస్తోంది. ఇందులో తూర్పు డెల్టాకు (ఉమ్మడి కృష్ణా జిల్లా) 3826 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా (గుంటూరు, బాపట్ల జిల్లాలు)కు 3,042 క్యూసెక్కులు, గుంటూరు ఛానల్‌కు 57 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. గరిష్టంగా ఆరు వేల క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తేనే కాల్వలకు పూర్తి స్థాయిలో నీటి విడుదల జరుగుతుంది. కానీ మూడు వేల క్యూసెక్కులు విడుదల చేయడం వల్ల అరకొర నీటి సరఫరా

2లో

వ్యవసాయ విద్యుత్ కోసం మంత్రికి సిపిఎం వినతి

ప్రజాశక్తి-నకరికల్లు

రైతులకు 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబును సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు మంత్రికి శనివారం వినతిపత్రం ఇచ్చారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు మండలంలోని చేజర్లకు వచ్చిన మంత్రి రాంబాబును సిపిఎం మండల కార్యదర్శి జి.పిచ్చారావు, నాయకులు ఇ.అప్పిరెడ్డి, ఎస్.రాంబాంజి నాయక్, సిహెచ్ కొండలు కలిశారు. గ్రామంలో 15 మంది పట్టాదారు పాసుపుస్తకాలు అందజేశారని, కానీ నేటికీ పొజిషన్ చూపలేదని చెప్పారు. సుగాలీలు ఎప్పటి నుండో సాగు చేస్తున్న భూముల్లో మైనింగ్ అనుమతిచ్చారని, దాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. ఈ సాగు భూములకూ పట్టాలివ్వాలన్నారు. ఈ మేరకు వినతిపత్రాన్ని మంత్రికి ఇచ్చారు. తహశీల్దార్‌తో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీనిచ్చారు.

నృత్యం చేస్తున్న వారితో మంత్రి రోజా

2లో

శిల్పారామం అట్టహాసంగా ప్రారంభం

పలువురు ప్రముఖులకు, కళాకారులకు మంత్రి రోజా సన్మానం

అడ్డగోలుగా కరెంటు ఛార్జీల పెంపు

- వామపక్షాల నాయకుల ఆగ్రహం
- గుంటూరు, మంగళగిరిలో ప్రజాబ్యాలెట్ నిర్వహణ

8లో

పరీక్ష కేంద్రాల వద్ద పరిశీలనలో ఐజి

ఎస్ఐ పరీక్షలకు నూరుశాతం హాజరు

ప్రజాశక్తి-గుంటూరు సిటి

గుంటూరు రేంజ్ పరిధిలో రాష్ట్ర పోలీసు రిక్రూట్మెంట్ బోర్డు శని ఆదివారాల్లో నిర్వహిస్తున్న ఎస్ఐ తుది రాత పరీక్షల కేంద్రాలను రేంజ్ ఐజి పాల్‌రాజు, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల ఎస్పీలు ఆరిఫ్ ఆఫీజ్, రవిశంకర్‌రెడ్డి, వకుల్ జిందాల్ శనివారం పరిశీలించారు. టిజెపిఎస్ కాలేజీ, ఆర్‌విఆర్ అండ్ జెసి కాలేజీ, ఏసీ కాలేజీ, విజ్ఞాన్ నిరుల, విజ్ఞాన్ డిగ్రీ కాలేజీల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో తొలిరోజు 7,145 మంది పరీక్షలుకు హాజరవ్వాల్సి ఉండగా నూరు శాతం హాజరు నమోదైంది. కేంద్రాల వద్ద అభ్యర్థుల ఫొటోలు, గుర్తింపు కార్డులతోపాటు బయోమెట్రిక్‌ను కూడా పరిశీలించాకే అధికారులు లోపలికి అనుమతించారు.

ఎన్నికలపై వైసిపి నేతల దృష్టి

8లో

పొలాలకు నీళ్లులేవు.. మాకు పనుల్లేవు..

- మీటరు రీడింగు ఆలస్యం వల్ల ఉచిత విద్యుత్ దక్కడం లేదు
- ట్రక్కు ఇసుక ధర రూ.5 వేలు పెరిగింది
- సిపిఎం ప్రజారక్షణ భేరి పాదయాత్ర ఎదుట ప్రజల ఆవేదన

ప్రజాశక్తి-సత్తెనపల్లి

వర్షభావ పరిస్థితులు, సాగర్ కుడి కాల్వకు సాగునీరు వదలక పోవడంతో సత్తెనపల్లి పట్టణంలోని వ్యవసాయ కార్మికులకు పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారని,ఈ నేపథ్యంలో పట్టణాల్లోనూ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు డిమాండ్ చేశారు. సిపిఎం చేపట్టిన 'ప్రజారక్షణ భేరి' పాదయాత్ర సత్తెనపల్లి పట్టణంలో రెండోరోజైన శనివారమూ కొనసాగింది. శాస్త్రినగర్, చెంచు కాలనీ, వీరాంజనేయ నగర్, రాజుల కాలనీ, పాత బస్టాండు, పార్కు రోడ్డు, బోయ కాలనీలలోలో పాదయాత్ర పర్యటించి స్థానికుల సమస్యలను తెలుసుకుంది. ఎస్సీ, ఎస్టీలకు విద్యుత్తు మీటరు రీడింగు ప్రతి నెలా ఆలస్యంగా తీస్తున్నారని, దీంతో తమకు 200 యూనిట్లు దాటి బిల్లు వస్తుందని, తమకు ఉచిత విద్యుత్ వర్తించడం లేదని శాస్త్రి నగర్, చెంచు కాలనీ ప్రజలు వాపోయారు. ఇళ్లకు మరమ్మతులు చేయించుకోవాలంటే ఇసుక ధర విపరీతంగా పెరిగిందని, గతంలో ట్రక్ రూ.రెండు వేలుంటే ఇప్పుడు రూ.ఏడు వేలుందని మరికొందరు ఆవేదనకు వ్యక్తం చేశారు. పొలాలకు నీరివ్వకపోవడంతో తమకు వ్యవసాయ పనుల్లేకుండా పోయాయని, కుటుంబ జీవనం కష్టమైందని కూలీలు ఆవేదనకు గురయ్యారు. ఈ సందర్భంగా

పాదయాత్ర బృందానికి సమస్యలు చెబుతున్న ప్రజలు

2లో

పులిచింతలపైనే ఆశలు

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతుందని రైతులు వాపోతున్నారు. పులిచింతలలో గరిష్ట నీటినిల్వ 45.77 టీఎంసీలు కాగా శనివారం రాత్రికి 31.88 క్యూసెక్కుల నిల్వ ఉంది. ఇందులో 5 వేల క్యూసెక్కులు ప్రకాశం బ్యారేజికి విడుదల చేస్తున్నారు. గతేడాది ఇదే సమయంలో 41.83 టీఎంసీల నిల్వ ఉంది. అయితే ఈ ఏడాది 31.88 టీఎంసీలు నిల్వ ఉండటం వల్ల పూర్తిస్థాయిలో కాల్వలకు నీరు ఇవ్వకలేకపోతున్నామని అధికారులు చెబుతున్నారు. అంతేగాక రాబోయే రెండునెలల్లో ఎగువ నుంచి వరద ప్రవాహం వచ్చే అవకాశం లేదు. ఇందువల్ల పొదుపుగా విడుదల చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితులు కొనసాగితే ఖరీఫ్‌లో మరో 16 టీఎంసిలు ఎలా ఇవ్వాలనే అంశంపై అధికారులు తర్జన భర్జనలు పడుతున్నారు. ఖరీఫ్‌లో మొత్తం కృష్ణా డెల్టాకు 90 టీఎంసీలు అవసరంకాగా ఇప్పటి వరకు 74 టీఎంసీలు వినియోగించామని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న 31 టీఎంసిల్లో 16 టీఎంసిలు వినియోగం కష్టంతో కూడుకున్న చర్యగా అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో డెల్టా కాల్వలకు అరకొరగానీటి సరఫరా చేస్తున్నారు. దీంతో వేసిన పంటలు బెట్టకు వచ్చి దిగుబడులు తగ్గే ప్రమాదం ఉంది.

గుంటూరు జిల్లాలోని తెనాలి, మంగళగిరి, పొన్నూరు, బాపట్ల జిల్లాల్లోని రేపల్లె, బాపట్ల, వేమూరు, చీరాల నియోజకవర్గాల్లో ఎక్కువ ప్రాంతాల్లో పొట్టదశలో ఉంది. బాగా ఆలస్యంగా సాగు చేసిన ప్రాంతాల్లో ఎదుగుదల దశలో ఉంది. దీంతో ప్రస్తుతం నీటి అవసరం పెరిగింది. 15 రోజులుగా వర్షాల్లేవు. పట్టిసీమ నుంచి నీటి విడుదలను భారీగా తగ్గించారు. ప్రభుత్వం శ్రద్ధచూపితే కొంత వరకు గోదావరి జలాలను ఉపయోగించుకునే అవకాశం ఉన్నా ఈ దిశగా అడుగులు వేయడం లేదు. అరకొరగా నీటి విడుదల చేస్తుండటం, గత వేసవిలో జరగాల్సిన కాల్వల మరమ్మతులు సరిగా జరగకపోవడం చివరి భూములకు నీరందే పరిస్థితిలేక వరి పైరు ఎండిపోతోంది.

పొలాలకు నీళ్లులేవు.. మాకు పనుల్లేవు..

(మొదటి పేజీ తరువాయి)

రవిబాబు మాట్లాడుతూ వ్యవసాయంలో ఇదే పరిస్థితులు కొనసాగితే రైతులతోపాటు కూలీలు తీవ్రంగా ఇబ్బంది పడతారని, సమస్య మరింత జఠిలమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సన్నద్ధం కావాలన్నారు. ఇప్పటికే ఉపాధి కరువై ప్రజలు ఇబ్బంది పడుతుంటే మరోవైపు ప్రభుత్వాలు పన్నులు, ధరల భారాలు మోపుతోందని,ఈ విధానాలను తిప్పికొట్టేందుకు సిపిఎం చేపట్టే పోరాటాల్లో ప్రజలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. పాదయాత్రలో సిపిఎం పట్టణ కార్యదర్శి డి.విమల, నాయకులు కె.శివదుర్గారావు, ఎ.వెంకటనారాయణ, ఎం.హరిపోతురాజు, కార్తీక్, ఇట్లాస్, ఎ.వీరబ్రహ్మం, ఆర్.పురుషోత్తం, పి.రామారావు, ఎం.జ్యోతి పాల్గొన్నారు.

రూరల్ గ్రామాల్లో రేపటి నుండి పాదయాత్ర

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మండలంలోని గ్రామాల్లో సిపిఎం పాదయాత్ర సోమవారం నుండి జరుగుతుందని సిపిఎం మండల కార్యదర్శి పి.మహేష్ తెలిపారు. 16వ తేదీ ఉదయం 8 గంటలకు లక్కరాజుగార్లపాడులో పాదయాత్రను సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ ప్రారంభిస్తారని చెప్పారు. ప్రజలు ఈ పాదయాత్రలో పాల్గొనాలని, సమస్యలను సిపిఎం బృందం దృష్టికి తేవాలని కోరారు.

జిజిహెచ్‌లో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-గుంటూరు సిటి

గుర్తుతెలియని వృద్ధుడు జిజిహెచ్‌లో శనివారం రాత్రి మృతి చెందాడు. అరండల్‌పేట 12 లైన్‌లో అపస్మారక స్థితిలో పడి ఉన్న వృద్ధుణ్ణి స్థానికులు 108 ద్వారా జిజిహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుని వివరాలు తెలియరాలేదని, తెలిసిన వారు 8688831332 నంబర్‌కు సంప్రదించాలని అరండల్‌పేట సిఐ రామానాయక్ కోరారు.

శిల్పారామం అట్టహాసంగా ప్రారంభం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరులోని అడవితక్కెళ్లపాడు వద్ద నిర్మించిన శిల్పారామాన్ని మంత్రి ఆర్.కె.రోజా శనివారం సాయంత్రం అట్టహాసంగా ప్రారంభించారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం 92 వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సభా కార్యక్రమానికి ముందుగా రాష్ట్ర సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మల్లికార్జునరావు స్వయంగా గీసిన అబ్దుల్ కలాం పెయింటింగ్‌ను, ఆయనపై రచించిన పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. నాదస్వర విద్వాంసులు పద్మశ్రీ షేక్ మహబూబ్ సుభానీ, షేక్ కాలేషా మహబూబి, రచయిత, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత కె.చదువుల బాబు, గాయకుడు, జాతీయ జెండా ప్రచారకర్త షేక్ మహబూబ్ సుభానీకి మంత్రి రోజా సన్మానం చేశారు. వివిధ రంగాలకు చెందిన కళాకారులనూ సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రాచీన కళలు, హస్తకళలను ప్రోత్సహించి వాటిని ప్రజలలోకి తీసుకెళ్ళి వాటి ప్రాముఖ్యతను తెలియజేసే ఉద్దేశంతో శిల్పారామాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. హస్తకళల ఉత్పత్తుల ప్రాచుర్యం కోసం ఎగ్జిబిషన్లు, మేళాలు నిర్వహించి వాటిని నేరుగా ప్రజలకు అమ్మడానికి ఏర్పాట్లు చేయడం, తద్వారా దళారి వ్యవస్థను అరికట్టి వారి ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలను కల్పించి ప్రోత్సహిస్తామని అన్నారు. కనుమరుగవుతున్న కళలను శిల్పారామంలో ప్రదర్శించి వాటికి తగు ఆదరణ కల్పించి, ప్రాచీన కళలు భవిష్యత్తు తరాలకు అందిస్తామని చెప్పారు. రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి చైర్పర్సన్ వంగపండు ఉష మాట్లాడుతూ అబ్దుల్ కలాం ప్రతి ఒక్క విద్యార్థి గుండెల్లో గుండె చప్పుడై వుండాలని కోరుకుంటున్నామని, పేద కుటుంబంలో పుట్టి, అంతరిక్ష శాస్త్రవేత్తగా ఎదిగారన్నారు. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ గుంటూరు నగరంలో ఆహ్లాదం కోసం పార్కులు, శిల్పారామం ఏర్పాటు చేసుకుంటున్నామని, పిల్లలు ఆడుకోవడానికి ఈ శిల్పారామం మంచి ప్రదేశమని, ఇక్కడ ఏర్పాటు చేసిన చెరువులో బోటింగ్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, కల్పలతరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యేలు మహమ్మద్ ముస్తఫా, మద్దాలి గిరిధర్‌రావు, శిల్పారామం సొసైటి సిఇఒ శ్యామ్ సుందర్‌రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ మందపాటి శేషగిరిరావు, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల సహాయ కార్పొరేషన్ ఛైర్పర్సన్ ముంతాజ్ పఠాన్, మచిలీపట్నం పోర్టు మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ సజీల పాల్గొన్నారు. తొలుత నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి.

నాదస్వర విద్వాంసులు పద్మశ్రీ షేక్ మహబూబ్ సుభానీని సన్మానిస్తున్న మంత్రి ఆర్‌కె రోజా

సెలవుల్లోనూ తరగతుల నిర్మహణపై ఆందోళన

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

కాలేజీలపై ఆర్ఐఒ పర్యవేక్షణ లోపం కారణంగా మంగళగిరి పట్టణంలోని పలు ప్రైవేట్ కాలేజీల్లో అనుమతి లేకుండా ఇష్టానుసారంగా సెలవు రోజుల్లోనూ తరగతులు నిర్వహిస్తున్నారని ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. పలు కాలేజీల్లో తాగునీరు కూడా సరిగా ఉండడం లేదని, బాత్రూములు అపరిశుభ్ర ఉంటున్నాయని అన్నారు. వీటిపై అధికారులు తనిఖీలు చేయాలని కోరారు. విజె జూనియర్ కాలేజ్ నిర్వాహకులు గతంలో వినాయక చవితి సందర్భంగా అన్నదానం రోజున సెలవు ఇచ్చినందువలన రెండో శనివారం కళాశాల నిర్వహిస్తున్నారని ఆర్ఐఒ పర్మిషన్ గవర్నమెంట్ కూడా చెప్పిందని, విజె జూనియర్ కాలేజీ కరస్పాండెంట్ చెప్పగా దీనిపై నాయకులు ఆర్ఐఒకు ఫోన్ చేశారు. అయితే తాను అనుమతి ఇవ్వలేదని ఆర్ఐవో చెప్పారు. తరగతుల నిర్వహణపై తాము ప్రశ్నించగా విజే కాలేజ్ కరస్పాండెంట్ తమ ఫోన్లు లాక్కుని అసభ్యంగా మాట్లాడుతూ బెదిరించారని మండిపడ్డారు. కళాశాలపై కళాశాల కరస్పాండెంట్‌పై చర్యలు తీసుకోవాలని విజె జూనియర్ కాలేజీ గేటు ముందు బైఠాయించారు. కార్యక్రమంలో నాయకులు వై.శివగోపి, ఎం.అభిషేక్, ఎ.హనోక్‌బాబు, రియాజ్ పాల్గొన్నారు.

ఆకలి సూచిలో దేశం వెనుకబాటు సిగ్గుచేటు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రపంచంలో 125 దేశాల్లో ఉన్న ఆకలి తీవ్రత స్థాయిని లెక్క గడితే భారత్‌కు 111 వస్థానం లభించడం, ఆ ఆకలి సూచీలో మన పొరుగుదేశాలైన పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్‌ల కన్నా మనం వెనుకబడి ఉండటం సిగ్గుచేట అయిన విషయమని అవగాహన సంస్థ విమర్శించింది. పోషకాహార లోపం, శిశువుల్లో తీవ్ర పోషకాహార లోపం, వయసుకు తగిన ఎత్తు లేకపోవడం, శిశుమరణాల రేటు అనే నాలుగు సూచికలు ఆధారంగా రూపొందించిన నివేదికలో భారత్ ర్యాంకు 111కు దిగజారడం ప్రజల జీవనోపాదుల క్షీణతను తేటతెల్లం చేస్తుందని పేర్కొంది. జర్మనీ, ఐర్లాండ్ కేంద్రాలుగా పని చేసే కన్సర్న్ వరల్డ్ వైడ్, వెల్ట్ హంగర్ హిల్స్ అనే యూరోపియన్ యూనియన్‌కి చెందిన స్వచ్ఛంద సంస్థల ఉమ్మడి కార్యాచరణతో గ్లోబల్ హంగర్ ఇండెక్స్ నివేదికను ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా విడుదల చేశారని,ఆ సూచీలో భారత ప్రజల దీనస్థితి బయటపడిందని అవగాహన సంస్థ పేర్కొంది.

మాట్లాడుతున్న వేమారెడ్డి

ఎన్నికలకు సిద్ధం కండి

ప్రజాశక్తి-తాడేపల్లి

ఎన్నికలు రాబోతున్నాయని, వైసిపి కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధం కావాలని ఎంటిఎంసి అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని వైసిపి కార్యాలయంలో శనివారం రాత్రి ఆ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రవేశపెట్టిన నవరత్నాలు ప్రజలకు ఉపయోగపడ్డాయని చెప్పారు. ప్రజల అభిమానమే వైసిపిని గెలిపిస్తుందన్నారు. నియోజకవర్గంలో వైసిపికి వ్యతిరేకత లేదన్నారు. మంగళగిరి ఎమ్మెల్యే సీటు ఎవరికి ఇచ్చినా కలిసి పని చేస్తామన్నారు. త్వరలోనే మంగళగిరిలో పార్టీ కార్యాలయం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేళి వెంకటేశ్వరరావు, ఎండి గోరెబాబు, యు.కల్యాణ్‌కుమార్, మాచర్ల అబ్బు తదితరులు పాల్గొన్నారు.

తోపుడు, టిఫిన్ బండ్లు అందజేత

ప్రజాశక్తి-తాడేపల్లి

నారా లోకేష్, పిఆర్ కోటేశ్వరరావు సంయుక్త సహకారంతో పది మందికి తోపుడుబండ్లు, ఏడుగురికి టిఫిన్ బండ్లు, ముగ్గురికి ప్లాట్‌ఫారం రిక్షాలు శనివారం సాయంత్రం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని కోరారు. నియోజకవర్గంలో అనేక సంక్షేమ కార్యకర్తలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి డి.దాసు, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ కె.మహాలక్ష్మి, కె.నిర్మల, చిన్నపోతుల సుబ్బారావు, ఇట్టా భాస్కర్, డి.సుందరరావు యాదవ్, సాయిచంద్, శౌరిఇన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

బండ్లు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

జూనియర్ విద్యార్థులను ర్యాగింగ్ చేయొద్దు

మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్ కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మెడికల్ కళాశాలకు వచ్చే ఫ్రెషర్స్‌ను ఇబ్బంది పెట్ట వద్దని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. శనివారం సూపరింటెండెంట్ చాంబర్‌లో 2021వ సంవత్సరం వైద్య విద్యార్థులు (అభ్యుదయ 21 బ్యాచ్) ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 16 వ తేదీన మెడికల్ కళాశాలలో ఫ్రెషర్ డే నిర్వహించనుండటం సంతోషకరమని అన్నారు. కళాశాలకు వచ్చే విద్యార్థులను ర్యాగింగ్ చేయకుండా స్నేహితుల మాదిరిగా ఆహ్వానించాలని ఆయన కోరారు. కళాశాల గొప్ప తనాన్ని ప్రతి ఒక్కరికి వివరించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం లో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి టి వి కె రెడ్డి, యు జి యం బి బి బి ఎస్ విద్యార్థులు ఎస్ ప్రదీప్, ఎస్ కె ఖుర్షి ద్, జావీద్, అస్లాం, దారా మల్లేశ్వరి, కొండ నిఖిత, పద్మ తేజస్విని, మేఘన, పూజిత పాల్గొన్నారు.

29న గుంటూరులో నూరుబాషాల 'సింహ గర్జన'

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ నూర్ భాషా, దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 29న గుంటూరులోని ఆంధ్ర ముస్లిం కళాశాల మైదానంలో సింహ గర్జన సభ నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ మహామద్ ఖాజా వలి, నగర అధ్యక్షుడు షేక్ ఆదాం షఫీ, వక్ఫ్ బోర్డు జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ స్టార్ మస్తాన్ తెలిపారు. స్థానిక గోరంట్లలో ఒక హోటల్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సభ 29 వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకి జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా తమ సంఘీయులు 20 లక్షల మంది వరకూ ఉన్నారని తమకు ఇంతవరకు ఏటువంటి రాజకీయ గుర్తింపు ఇవ్వలేదన్నారు. ఈ నెల 29 న జరిగే సదస్సు కి రెండు లక్షల మంది తమ సంఘం వారు హాజరు అవుతారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తమకు రాజకీయం గా తగిన ప్రాతినిధ్యం కల్పించే పార్టీ కి మద్దతు ఇస్తామని వారు తెలిపారు. ఇప్పటి వరకూ ప్రధాన రాజకీయ పార్టీలు హామీలు ఇచ్చి అమలు చేయలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో తమకు తగిన ప్రాధాన్యత ఇచ్చే పార్టీలకి మద్దతు ఇస్తామని తెలిపారు. సమా వేశంలో సంఘం నాయకులు డాక్టర్ మస్తానమ్మ, 10 డివిజన్ కార్పొరేటర్ షేక్ మీరావలి, రహంతుల్లా పాల్గొన్నారు.

నేటి నుంచి దసరా ఉత్సవాలు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అప్పిరెడ్డి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

స్థానిక చుట్టుగుంట పోలేరమ్మ దేవస్థానంలో ఆదివారం నుంచి ఈనెల 23 వరకు దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. 20 సంవత్సరాల నుంచి క్రమం తప్పకుండా చుట్టుగుంటలోని పోలేరమ్మ తల్లి దేవస్థానంలో శ్రీదేవి శరన్నవ రాత్రి మహెూత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆయన శనివారం మీడియాకు తెలిపారు. 2023 ఉత్సవాలకు సంబంధించి ప్రత్యేకంగా రూపొందించిన బ్రోచర్‌ను స్థానిక పెద్దలు, దేవ స్థానం కమిటీ సభ్యులు, జీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులుతో కలిసి ప్రభుత్వ విప్ లేళ్ళ అప్పిరెడ్డి ఆవిష్కరించారు. ప్రతి సంవత్సరం ఈ ఉత్సవాలను దేవస్థానం ఉత్సవ కమిటీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని ఆయన వివరించారు. పలు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగు తాయని వివరించారు.

కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బందా రవీంద్ర నాథ్, 24వ డివిజన్ కార్పొరేటర్ ఎ.పద్మా వతి, ఆలయ కమిటీ ఛైర్మన్ ఎ.శ్రీనివాస రావు, కుమ్మర కోటే శ్వరరావు, టి.నాగే శ్వరరావు, సాంబిరెడ్డి, కార్పొ ేటర్ కె.గురవయ్య, ఆర్.రోశయ్య, ఎస్. వెంకటరెడ్డి, టి. వెంకటరెడ్డి పాల్గొన్నారు.

టిడిపికి చెందిన 14 మంది అరెస్టు

ప్రజాశక్తి-విజయపురిసౌత్

వెల్దుర్తి మండలం గొట్టిపాళ్ళ గ్రామానికి చెందిన 14 మంది తెలుగుదేశం పార్టీ వర్గీయు లను అరెస్ట్ చేసి శనివారం మాచర్ల కోర్టు లో హాజరు పరిచినట్లు వెల్దుర్తి ఎస్ఐ శ్రీహరి తెలిపారు. ఎస్సై శ్రీహరి విలేకరులతో మాట్లాడుతూ గత నెల 29న గ్రామంలో జరిగిన ఉత్సవాలలో వైసిపి, టిడిపి వర్గీయులు ఘర్షణకు దిగారు. ఈ కేసులో టిడిపికి చెందిన జక్కుల వెంకటేశ్వర్లు, రాజబోయిన ప్రసాదు, బూడిద బాలయ్య, మరో 11 మందిని అరెస్టు చేసి కోర్టు లో హాజరు పరచగా న్యాయమూర్తి నిందితులకు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-గుంటూరు సిటి : పాత గుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట స్థావరాలపై శనివారం పోలీసులు దాడి చేశారు. సీఐ ఎం.వి సుబ్బారావు ఆధ్వర్యంలో ఎస్ఐ వెంకటేశ్వర రావు ,ఎస్‌బి హెడ్ కానిస్టేబుల్ బాషా, సిబ్బందితో కలిసి మంగళదాస్‌నగర్ 2 వ లైన్ లో పేకాట ఆడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకొన్నారు. వారి వద్ద నుండి, 10 సెల్ ఫోనులు, రెండు ద్విచక్ర వాహనాలతో పాటు రూ.54,250 ను సీజ్ చేశారు.వారిపై కేసు నమోదు చేసి విచారణ నిమిత్తం పాత గుంటూరు పోలీస్ స్టేషన్‌నకు తరలించారు.

ఎర్రబాలెంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కొనసాగుతున్న టిడిపి నిరసనలు

ప్రజాశక్తి-వినుకొండ: మాజీ సీఎం చంద్రబాబు అక్రమ అ రెస్టును నిరసిస్తూ ప్రజల మద్దతు కూడగట్టే కార్యక్రమంలో భాగంగా పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు స్థానిక 1వ వార్డు కళ్యాణపురికాలనీ, సీతయ్య నగర్ లో శనివారం రాత్రి కర పత్రాలను పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా భారీగా ఆ ప్రాంత మహిళలు పాల్గొని మద్దతు ప్రక టించారు. ఈ సందర్భంగా జీవి ఆంజనేయులు మాట్లాడుతూ చంద్రబాబుపై అక్రమ కేసులు అరెస్టులపై ప్రభుత్వ తీరును ఎండగట్టారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ ఆయుభ్ ఖాన్,టిడిపి రాష్ట్ర కార్యదర్శి షమీంఖాన్ తదితరులు పాల్గొన్నారు. వినుకొండ పట్టణం లోని ఎంపీడీవో కార్యాలయం వద్ద గల మహాత్మా గాంధీ విగ్రహం వద్ద టిఎన్ఎస్ఎఫ్ నాయకులు వినూత్న నిరసన వ్యక్తం చేశారు. మోకాళ్లపై నిలిచి, చేతులకు సంకెళ్లు వేసు కుని నిరసన తెలిపారు. నిరసనలో టిఎన్ ఎస్ఎఫ్ అధ్యక్షుడు కె.హనుమంతరావు, నియోజవర్గ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు ఎన్.కిషోర్, పార్లమెంట్ అధికార ప్రతినిధి వి. ప్రశాంత్, పార్లమెంట్ టిఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు కరీం, టౌన్ టిఎన్ ఎస్ఎఫ్ అధ్యక్షుడు ఎస్కె కాజా తదితరులు పాల్గొన్నారు. **నాదెండ్ల:** టిడిపి రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షుడు పూదోట సునీల్ వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. కనపర్రు బాలయేసు చర్చిలోకి మోకాళ్లపై నడిచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. **తాడేపల్లి:** చంద్రబాబును వెంటనే విడుదల చేయాలని, జైల్లో సరైన వైద్య సేవలు అందించాలని తాడేపల్లి టిడిపి అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు ఆధ్వర్యంలో నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేశారు. ముందుగా టిడిపి కార్యాలయం నుంచి ఎంటిఎంసి జోనల్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు ఎం.సత్యనారాయణ, కె.దాసు, చిన్నపోతుల చిన్నా, ఇట్టా భాస్కర్, అన్నెం కుసుమ, ఎ.మురళీ, గోలి శౌరి, ఎం.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు. **మంగళగిరి రూరల్:** టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆరోగ్యం బాగుండాలని కోరుతూ ఎర్రబాలెంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ఆకుల జయ సత్య, ఆకుల ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో రాములవారి గుడిలో, ఆంజ నేయ స్వామి గుడిలో, గంగానమ్మ తల్లి గుడిలో పూజలు చేశారు. శివాలయంలో కొవ్వొత్తులతో నినా దాలు ఇస్తూ 'బాబు కోసం ఎర్రబాలెం గ్రామస్తులు సైతం' అంటూ సంఘీభావం తెలిపారు. చంద్ర బాబును వెంటనే విడుదల చేయాలని, ఆరోగ్యం బాగుండాలని కోరుకుంటూ గ్రామంలో పెద్ద ఎత్తున మహిళలు ,కార్యకర్తలు, నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో గ్రామ టిడిపి కార్యకర్తలు చింతా. జగన్, కర్రాటి సత్య నారాయణ, దానబోయిన శంకర్రావు, ఆల వెంకటనారాయణ, దూల గోపయ్య, ఎల మం చిలి పద్మజ, అప్పల శాంతి, నాయుడు పార్వతి, కొమ్మూరు సుగుణ కుమారి ,ఫిరోజ్ ఖాన్ తోట సురేష్, పానకాయల శివ నాగేశ్వర రావు, ఆకుల పానకాలరావు, మేరిగ మేరీ గడదాసు. రంగారావు, కానుకలను సుబ్బారావు, శనగల సాంబిరెడ్డి పాల్గొన్నారు.

తాడేపల్లిలో అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి నాయకులు

IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE COURT, NARASARAOPET
I.P. No. 37/2023

Between :
Nalabothu Narasimha Rao ... Petitioner
And
Athukuri Suresh & Others... Respondents

Respondent Address :
R-11 : రాచమడుగు లక్ష్మిగంగాధర్, S/o రామారావు, A/48 సం॥, Door No.2-91, కట్టెల అదితి బజార్, పిడుగురాళ్ల టౌన్ మండలం, పల్నాడు జిల్లా. Cell No.9376542031.

పై నెంబరు ఐ.పి. నందు 37/2023 నల్లబొతు నరసింహారావు అను నేను ఐ.పి. దాఖలు చేసుకొని యున్నాను. సదరు ఐ.పి. నెంబరు 37/2023లో శ్రీయుత కోర్టువారి ద్వారా ఆర్-11కు పలుమార్లు కోర్టువారు సమన్లు జారీ చేసినచో వారు తీసుకోని యెడల శ్రీయుత కోర్టువారు పేపరు పబ్లికేషన్ ద్వారా సబ్‌స్టిట్యూట్ సర్వీస్ ద్వారా మీకు తెలియపరచటమైనది. ఏమనగా పై నెంబరు ఐ.పి. నందు 14-11-2023 తేదీన ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి యెదుట హాజరై మీరుగాని, మీ తరఫున న్యాయవాదిగారి ద్వారా గానీ మీకుగల ఆక్షేపణలను కోర్టు వారి యెదుట తెలుపగలరు. లేనియెడల మీకు పరోక్షంగా తీర్మానించబడునది. శ్రీయుత కోర్టువారి ద్వారా ఈ పేపరు పబ్లికేషన్స్ వేయటమైనది.

శ్రీయుత కోర్టువారి ఉత్తర్వులతో

పి.చక్రపాణి, బి.కాం., ఎల్ఎల్.బి.,
అడ్వకేట్,
నరసరావుపేట, **నరసరావుపేట.**
ది.14-11-2023 **సెల్ : 9385644200**

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ అయిన గుంటూరుజిల్లా, మంగళగిరి మండలం, కాజ గ్రామం కాపురస్తుడు శ్రీ దబ్బకూటి భూషయ్య గారి కుమారుడు వెంకటరత్నం గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ 16-6-1997వ తేదీన గుంటూరుజిల్లా, మంగళగిరి మండలం, కాజ కాపురస్తుడు శ్రీ మాణిక్యల రామయ్యగారి కుమారుడు వెంకటేశ్వరరావు గారి వద్ద నుండి ఈ దిగువ తెలిపిన నోటీసు షెడ్యూలు ఆస్తిని రిజిష్టర్ దస్తావేజు (1439/1997) ద్వారా కొనుగోలు చేసియున్నాడు. అప్పటి నుండి సదరు షెడ్యూల్ నా క్లయింట్ స్వాధీనంలో వుండియున్నది. ఇదిలా వుండగా నా క్లయింట్ ది. 06-10-2023వ తేదీన ఉదయం 11 గం.ల సమయంలో తన దస్తావేజు (1439/1997) ఫొటోస్టాట్ తీసుకొను నిమిత్తం కాజ గ్రామం నుండి ఆటోలో మంగళగిరి అంబేద్కర్ విగ్రహం వద్ద వచ్చిచూడగా సదరు దస్తావేజు (1439/1997) కనిపించలేదు. చుటుట్పక్కల వెతికాను, కానీ దొరకలేదు. కావున సదరు దస్తావేజు (1439/1997) ఎవరికైనా దొరికిన యెడల నాకు గానీ నా క్లయింట్‌కి గాని అందజేయగలరు. అలా కాకుండా సదరు దస్తావేజు (1439/1997) అన్యాక్రాంతం చేసిన యెడల అట్టివారిపై నా క్లయింట్ చట్టపరమైన సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకోబడునని తెలియజేయటమైనది.

షెడ్యూల్

గుంటూరుజిల్లా, పెదకాకాని సబ్ - రిజిస్ట్రేషన్, మంగళగిరి మండలం, కాజ గ్రామం, కాజ పంచాయతీ ఏరియాలో చేరిన, కాజ డి.నెం. 421/1లో బ్లాక్ నెం.5, డోర్ నెం. 5-12-10 గల AC.0-05 సెంట్లు స్తలమునకు హద్దులు.
తూర్పు : 24 అడుగుల పంచాయతీరోడ్డు హద్దు 44'-9" దక్షిణం : దబ్బకూటి రాధాకృష్ణమూర్తి గారి స్థలము హద్దు 52' పడమర : సింహాద్రి వేమారెడ్డి గారి భూమి హద్దు 38-9" ఉత్తరం : మాణిక్యల వేంకటేశ్వరరావు గారి స్థలము హద్దు 52'

ఇట్లు
కట్టెపోగు కోటేశ్వరరావు,
న్యాయవాది,
డోర్ నెం. 5-165/బి 943,
ఇందిరానగర్, మంగళగిరి.
గుంటూరుజిల్లా.

IN THE COURT OF THE HOUNERBLE ADDITIONAL SENIOR CIVIL JUDGE NARASARAOPET
IP : 63/2023

Between:-
కురంగి వెంకటరత్నం (44) W/o వెంకటేశ్వర్లు, R/o D.No: 4-82, మెయిన్ రోడ్ సొలస గ్రామం మరియు పోస్ట్ యడ్లపాడు మండలం, పల్నాడు జిల్లా.
రెస్పాండెంట్స్:-
1) మంచా నాగేశ్వరరావు (age55) S/o కోటయ్య, R/o తూర్పు బజార్, సొలస గ్రామం, మరియు పోస్ట్ యడ్లపాడు మండలం, పల్నాడు జిల్లా.
2) మంచా కుమారి (age50) w/o నాగేశ్వరరావు, R/o తూర్పు బజార్, సొలస గ్రామం, మరియు పోస్ట్, యడ్లపాడు మండలం, పల్నాడు జిల్లా.
3) నాగండ్ల పిచ్చయ్య (age60) S/o వెంకటేశ్వర్లు, R/o పడమర బజార్, సొలస గ్రామం, మరియు పోస్ట్, యడ్లపాడు మండలం,పల్నాడు జిల్లా.
4) మద్దూరి నారాయణ రెడ్డి (age70) S/o సత్యనారాయణ రెడ్డి, R/o పడమర బజార్, సొలస గ్రామం, మరియు పోస్ట్, యడ్లపాడు మండలం, పల్నాడు జిల్లా.
5) బాపతు రామకోటి రెడ్డి (age 60) S/o చెన్నా రెడ్డి, R/o పడమర బజార్, సొలస గ్రామం, మరియు పోస్ట్, యడ్లపాడు మండలం, పల్నాడు జిల్లా.
6) తెల్లబాటి నాగరాజు (age 30) S/o శ్రీనివాసరావు, R/o పడమర బజార్, సొలస గ్రామం, మరియు పోస్ట్, యడ్లపాడు మండలం,పల్నాడు జిల్లా.
7) అవుదూరి సీత (age 50) w/o జయ, R/o పడమర బజార్, సొలస గ్రామం, మరియు పోస్ట్, యడ్లపాడు మండలం, పల్నాడు జిల్లా.
8) బాపతు అంజమ్మ (age 50) w/o రామిరెడ్డి, R/o దక్షిణం బజార్, సొలస గ్రామం, మరియు పోస్ట్, యడ్లపాడు మండలం,పల్నాడు జిల్లా.
9) చినచిన్నయ్యగారి అంజిరెడ్డి (age70) S/o చెన్నారెడ్డి, R/o తూర్పు బజార్, సొలస గ్రామం, మరియు పోస్ట్, యడ్లపాడు మండలం, పల్నాడు జిల్లా.
10) బాపతు శ్రీనివాసరెడ్డి (age40) S/o చెన్నారెడ్డి, R/o తూర్పు బజార్, సొలస గ్రామం, మరియు పోస్ట్, యడ్లపాడు మండలం, పల్నాడు జిల్లా.
11) గువ్వల రాములు (age50) S/o నాగయ్య, సొలస గ్రామం, మరియు పోస్ట్, యడ్లపాడు మండలం, పల్నాడు జిల్లా.

పై నెం.I.P నందు పిటిషనర్ అయిన కురంగి వెంకటరత్నం W/o వెంకటేశ్వర్లు, నరసరావుపేట అదనపు సీనియర్ సివిల్ జడ్జ్ నందు I.P దాఖలు చేసినారు. సదరు పిటీషనర్ పైన ఉదహరించిన రెస్పాండెంట్లు కాకుండా ఇంకనూ ఎవరికైనా మీకు బాకీ ఉన్న యెడల మీరు స్వయంగా కానీ మీ న్యాయవాది గారి ద్వారా కానీ ది. 31-10-2023 న ఉదయం 10.30 ని.లకు శ్రీ పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం.
వాయిదా. ది. 31-10-2023.

ఎం. హరీష్ కుమార్,
పిటిషనర్ తరపు న్యాయవాది,
D/44, ఎన్. ఎస్.పి కాలనీ,
నరసరావుపేట, పల్నాడు జిల్లా.
Cell.No: 9000727483.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

రాజకీయ పార్టీల నాయకులతో కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కలెక్టరేట్ లోని ఎస్. అర్. శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో రాజకీయ పార్టీల నాయ కులతో జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకం శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీల నాయకులు తమ ప్రాంతాలలో ఎలాంటి ఫిర్యాదులు ఉన్న తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ఓటర్ల జాబితా, లేదా పోలింగ్ కేంద్రాలు, ఓటింగ్ ప్రాంతాలు, ఓటింగ్ జరిగే కేంద్రాలు, ఓటింగ్‌కు కావలసిన సామగ్రి సరఫరా, ఓటింగ్ కేంద్రాల మార్పులు, చేర్పు లకు సంబంధించి ఏమైనా ఫిర్యాదలు ఉంటే లిఖితపూర్వకంగా తెలియజేయాలని కోరారు. 2024 - ఎన్నికలకు సంబంధించి, ప్రిపరేషన్ ఎలా చేయాలో ఎఫ్ఎల్ఒసి ఆఫ్ ఇవిఎంలు, వి.వి పాట్స్ వినియోగించే పద్ధతులను వివ రించారు. సమావేశంలో అని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కల్ప శ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రి తనిఖీ కేంద్రంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్

ఇవిఎం, వివిప్యాట్‌ల తనిఖీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట, మార్కెట్ యార్డులోని ఎలక్షన్ సామాగ్రిని కలెక్టర్ ఎల్.శివశంకర్,జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ లు శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఎలక్షన్ ఆఫీసర్ తరహాలో మార్కెట్ యార్డులోని ఇవిఎం, వివిప్యాట్‌ల తనిఖీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. 2024 - ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎన్నికల అధికారులు అన్ని సామాగ్రిని సన్నద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గోడౌన్ నిర్వహణ అధికారి జాయింట్ కలెక్టర్, ట్రైనీ కలెక్టర్ కల్ప శ్రీ, డిఆర్ఓ వినాయకం, ప్రోటోకాల్ సిబ్బంది, ఎన్నికల నిర్వహణ అధికారులు పాల్గొన్నారు. ఇవిఎం, వివిప్యాట్‌లు సక్రమంగా సరిపడా ఉన్నాయో లేదో గమనించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-విజపురిసౌత్

ప్రస్తుతం జరుగుతున్న వరల్డ్ కప్ క్రికెట్ మ్యాచ్‌ల సందర్భంగా ఎవరైనా క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మాచర్ల రూరల్ ఎస్ఐ కె. రాజశేఖర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ ఎవరైనా క్రికెట్ బెట్టింగ్ కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే బెట్టింగ్‌లపై నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు ఎవరికైనా తెలిస్తే వారు పోలీస్ శాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు. తమకు సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ఎవరైనా బెట్టింగ్ లకు పాల్పడినట్లు నిరూపితమైతే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని అన్నారు. గతంలో క్రికెట్ బెట్టింగ్ ఆడిస్తూ పట్టుబడ్డ పాత నేరస్తులపై కూడా నిఘా ఉంచినట్లు చెప్పారు.

పొలాలకు సాగునీటిని సత్వరమే ఇవ్వండి

- ఎండిపోతున్న పంటలు కాపాడండి
- నీరు కావాలంటుంటే.. మీరు ఏ పార్టీ వారు.. అని అడుగుతున్న మంత్రి
- ఎపి రైతు,కౌలు రైతు సంఘాల నాయకులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటలు తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఎండిపోతున్నాయని, వాటిని కాపాడేందుకు ప్రభుత్వం స్పందించి సాగర్ నీటిని మోటార్ల ద్వారా తోడి పంటలకు అందించాలని రైతు, కౌలురైతు సంఘాల పల్నాడు జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కోటప్పకొండ రోడ్డు లోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రరాష్ట్ర ప్రయోజనాలను తెలంగాణకు తాకట్టు పెట్టిన నేపథ్యంలోనే ఎడమ కాలువ ద్వారా తెలంగాణకు సాగు నీరు విడుదల చేశారని అన్నారు. రాష్ట్రంలో పంటలు ఎండిపోతున్నా కనీసం ఆరుతడికి కూడా నీరు ఇవ్వలేని నిస్సహాయ స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. సాగునీరు ఇవ్వలేమని ఆరుతడి పంటలు వేసుకోవాలని చెప్పిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ఎండిపోతున్న పంటలను చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. జిల్లాలో 5.12 లక్షల ఎకరాల సాగు భూమి ఉండగా 3 లక్షల ఎకరాలకు లోపు సాగు చేశా రని, 2.40 లక్షల ఎకరాల భూమి బీడుగా ఉందని అన్నారు. రబీకి ముందు కురిసిన ఒక మోస్తరు వర్షానికి ఆరుతడి పంటలకు నీరు ఇస్తామని ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని అధికారులు చెప్పడంతో అధిక సంఖ్యలో రైతులు మిర్చి సాగు చేపట్టారన్నారు.

మంత్రి అంబటి రాంబాబును గడప గడపలో సాగు నీరు గురించి ప్రజలు ప్రశ్నిస్తే 'మీరు ఏ పార్టీ?' అని ఎదురు మాట్లాడడంతో పాటు దుర్భాష లాడుతున్నారని విమర్శించారు. ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలు విడుదల చేసి రైతులకు భరోసా కల్పించిన దాఖలాలే లేవని అన్నారు. గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాలు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయాయని, ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు సరఫరా చేస్తామన్న ప్రభుత్వం మాటలకే పరిమితమైందని విమర్శించారు. ప్రత్యామ్నాయ పంటల సాగు పట్ల రైతులకు అవగాహన కల్పించాలని, సాగునీరు విడుదల చేసే ఎండిపోతున్న పంటలు కాపాడాలని డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు,రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి బాలకృష్ణలు మాట్లాడుతూ ప్రస్తుతం పల్నాడు జిల్లాలో కరువు తాండవిస్తున్న నేపథ్యంలో ఈ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలన్నారు. రాష్ట్రంలో 13 జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. ప్రస్తుతం ఖరీఫ్ లో పంటలు సాగు చేసిన వారిలో అధిక శాతం కౌలు రైతులే ఉన్నారన్నారు. ముందస్తు కౌళ్ళు చెల్లించి, ఏ పంటలు వేయాలో అర్థం కాక అయోమయంలో ఉన్నారని అన్నారు. పల్నాడు జిల్లాలో ఉన్న సాగు భూమిలో 65 శాతానికి పైగా కేవలం వరి సాగుకు మాత్రమే అను కూలమని, సాగర్ జలాలు లేకపోవడంతో చాలా వరకు సాగుభూములు బీళ్లుగా మారాయన్నారు. తక్షణమే సాగు నీరు విడుదల చేయకపోతే తమతో కలిసొచ్చే రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతులను ఐక్యం చేసి పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

మాట్లాడుతున్న రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు

చంద్రబాబుకు సూపర్ స్పెషాలిటీ వైద్యమందించాలి

- హెల్త్ బులిటెన్ విడుదల చేయాల్సింది వైద్యులా? పోలీసులా?
- టిడిపి రాష్ట్ర డాక్టర్స్ సెల్ ఉపాధ్యక్షులు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వైసిపి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులతో జైలు జీవితం గడుపుతూ, చర్మ సంబంధిత రుగ్మతలు, డి. హైడ్రేషన్ తో ఇబ్బంది పడుతున్న టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హెల్త్ బులిటెన్‌ను వైద్యులు విడుదల చేయాల్సి ఉండగా ప్రభుత్వ కనుసన్నల్లో పని చేస్తున్న పోలీసు వ్యవస్థ విడుదల చేయడం తమకు అనుమానంగా ఉందని టిడిపి డాక్టర్స్ సెల్ ఉపాధ్యక్షులు డాక్టర్ కడియాల వెంకటేశ్వర రావు అన్నారు. స్థానిక టిడిపి జిల్లా కార్యాలయంలో శనివారం టిడిపి డాక్టర్స్ సెల్ విభాగం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కడియాల మాట్లాడుతూఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజలను తప్పుదోవ పట్టించడం కోసమే చంద్రబాబును అరెస్ట్ చేశారని అన్నారు. చంద్రబాబుని కావాలనే ఇబ్బందులు పెడుతున్నారని, ఆరోగ్యం దెబ్బ తిన్న ప్పటికీ సరైన వైద్యం అందించకుండా కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు ఆరోగ్యం విషయంలో అనేక సందేహాలున్నాయని, 45 ఏళ్లకు పైగా సుదీర్ఘ రాజకీయ చరిత్ర 74 ఏళ్ళ వయసు కలిగిన ఆయనను వేధింపులకు గురి చేశారని ఆరోపించారు. ప్రతిపక్ష టిడిపి నేతలు ఏమి చెప్పినా ప్రభుత్వం వినే పరిస్థితి లేదని విమర్శించారు. సొంత బాబాయ్ ని చం పిన వ్యక్తులు నీతి వాక్యాలు మాట్లాడం సిగ్గు చేటని అన్నారు. చంద్రబాబు కుటుంబ సభ్యులు మంచి ఆహారం పెట్టడం లేదని సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పడం సిగ్గుచేటని అన్నారు. వైసిపి నాలుగున్నరేళ్ల పాలనలో అభివృద్ధిని గాలికొదిలి, కక్ష సాధింపులపై దృష్టి సారించారని ఆరోపిం చారు. చంద్రబాబుకు తక్షణమే సూపర్‌స్పెషాలిటీ ఆసు పత్రిలో చికిత్స అందించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబుకు మెరుగైన వైద్యం అందించకపోతే ఇప్పటి వరకు చేస్తున్న నిరసన కార్యక్రమాలను ఇంకా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర డాక్టర్ సెల్ అధికార ప్రతినిధి డాక్టర్ నాగోతు ప్రకాష్, జిల్లా డాక్టర్ సెల్ సభ్యులు డాక్టర్ వరబాబు, డాక్టర్ పువ్వాడ సూర్య నారాయణ, డాక్టర్ చేకూరి కోటేశ్వరరావు, డాక్టర్ వీరయ్య చౌదరి, డాక్టర్ లలిత్ సాగర్, డాక్టర్ బాజీ బాబు, డాక్టర్ బండ్ల రామచంద్ర,టిడిపి రాష్ట్ర రైతు విభాగం నాయకులు గొట్టిపాటి జనార్ధన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు

నేర్చుకున్న అంశాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో నేర్చుకున్న అంశాలను అభ్యాసకులు సద్వినియోగం చేసుకోవాలని సార్వత్రిక విద్యాపీఠం రాష్ట్ర పరిశీలకులు అక్బర్ అలీ అన్నారు. పల్నాడు జిల్లా సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నరసరావుపేట పట్టణం పల్నాడు రోడ్డులోని మునిసిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో జరుతున్న పర్సనల్ కాంటాక్ట్ తరగతులను శనివారం రాష్ట్ర పరిశీలకులు అక్బర్ అలీ తనిఖీ చేశారు. శిక్షణా తరగతులపై సంతృప్తి వ్యక్తం చేశారు. సెలవు దినాలలో నిర్వహించే ఈ తరగతులకు అభ్యాసకులు హాజరుకావాలని, అధ్యాపకుల సూచనలు పాటిస్తూ తమ విద్యను కొనసాగించాలని అన్నారు. ఈ తరగతులు ప్రతి సెలవు దినంలోఉదయం 9.30 గంటలకు ప్రార్ధనతో ప్రారంభమై సాయంత్రం 4.30 గంటలకు ముగిసేలా పర్యవేక్షిం చాలని పాఠశాల ప్రధానో పాధ్యా యులు రవికాంత్‌కు సూచించారు. ఈ నెల 30వ తేదీ వరకు 10వ తరగతి, ఇంటర్‌లో అడ్మిషన్లు పొం దేందుకు అవకాశం ఉందని అన్నారు. జిల్లా సమన్వయకర్త కెఎంఎ హుస్సేన్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుండి అభ్యాసకులకు కర పత్రాలు, ఉత్తీర్ణత సర్టిఫికెట్లు తపాలా శాఖ ద్వారా నేరుగా అభ్యాసకుల ఇళ్లకు పంపించడం జరుగుతుందని అన్నారు. దీని ద్వారా అభ్యాసకులు విద్యకు ఎటువంటి ఆటంకం లేకుండా కొన సాగించవచ్చని, బడి మధ్యలో ఆపిన వారు, గృహిణులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని, ప్రతి అభ్యాసకుడు తప్పనిసరిగా 30 తరగతులకు హాజరు కావాలన్నారు.

తపాలా శాఖ ఉద్యోగుల రక్తదానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జాతీయ (పోస్టల్) తపాలా వారోత్సవాల్లో భాగంగా స్థానిక పల్నాడు బ్లడ్ సెంటర్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక తపాలా శాఖకు చెందిన ఉద్యోగులు రక్త దానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పోస్టల్ సూపరింటెండెంట్ వెంకటస్వామి మాట్లాడుతూ కరోనా సమయం తర్వాత రక్తం తగినంతగా అవసరమైన వారికి అందించలేని పరిస్థితి వచ్చిందని, దానికి కారణం ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడమేనని అన్నారు. వీలైనంత ఎక్కువమంది రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందని, అందుకే తమ శాఖ ఉద్యోగులు రక్తదాన చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పల్నాడు బ్లడ్ సెంటర్ డైరెక్టర్ జానకిరామయ్య మాట్లాడుతూ తమ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా రక్త దానం చేయడానికి ముందుకు వచ్చిన దాతలకు రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తించేలా బీమా పత్రాలు అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం పోస్టల్ శాఖ సూపరింటెండెంట్ వెం కటస్వామి, అదనపు సూపరింటెండెంట్ శ్రీనివాసరావులను సన్మానించారు. కార్యక్రమంలో బ్లడ్ సెంటర్ వైద్యులు డాక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రక్తదానం చేసిన వారితో వైద్యులు, సిబ్బంది

26 వేల ఎకరాల కోసం రూ.కోటి ఇవ్వలేరా?

- హైలెవెల్ ఛానల్ కింద ప్రశ్నార్థకంగా మారిన సాగు
- ఒక్కో రైతులకు రూ.10 వేల అదనపు భారం : రైతు సంఘం

హైలెవల్ ఛానల్‌ను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

మంగళగిరి, తెనాలి, పొన్నూరు నియోజకవర్గాల పరిధిలోని 26 వేల ఎకరాలకు నీరందించే హైలెవెల్ ఛానల్ నిర్మాణానికి రూ.కోటి కేటాయించకపోవడం రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు విమర్శించారు మండలంలోని పెనుమూలి పరిధిలో హైలెవెల్ ఛానల్ కింద సాగుతున్న పొలాలను రైతు సంఘం నాయకులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ గ్రామ పరిధిలోని 4 వేల ఎకరాల్లో 3500 ఎకరాలు పంట ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన రూ.కోటి చెల్లిస్తే నిర్మాణం పూర్తవుతుందని, అయినా ఆయా ఎమ్మెల్యేలు చోద్యం చూస్తున్నారని అన్నారు. ఆయిల్ ఇంజిన్లతో పొలాలకు నీరు పెట్టాల్సి రావడంతో రైతులకు రూ.10 వేల అదనపు ఖర్చు అవుతోందని, హై లెవెల్ ఛానల్‌ను పూర్తి చేసి పొలాలకు నీరందించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, హై లెవెల్ ఛానల్ పోరాట కమిటీ కన్వీనర్ ములక శివసాంబిరెడ్డి మాట్లాడుతూ గుర్రపు డెక్క, తూటికాడ, కంపతో పంట కాల్వ నిండిపోయిందని, నీరు సైతం సరిగా పారుదల కావడం లేదని, ఆయిల్ ఇంజన్లకు కూడా నీరు సరిగా అందడం లేదని తెలిపారు. 75 శాతం కౌలు రైతులున్న ఈ ప్రాంతంలో ఎకరాకు రూ.20-25 వేలు కౌలు చెల్లించి సాగు చేస్తున్నారని, ప్రస్తుత పరిస్థితులతో పెట్టుబడి కూడా రాదేమోనని ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. హైలెవల్ ఛానల్‌ను పూర్తి చేస్తే రైతులకు ఈ దయనీయ దుస్థితి వచ్చేది కాదని అన్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా సమస్యను గుర్తించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జె.బాలరాజు, బి.అమ్మిరెడ్డి, ఎన్.యోగేశ్వర రావు, వై.బ్రహ్మేశ్వరరావు, జె.వీరస్వామి, గోపాల్‌రెడ్డి, కె.భాస్కర్, రజాక్ పాల్గొన్నారు.

కొలనుకొండలో పడకేసిన పారిశుధ్యం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

మండలంలోని కొలనుకొండలో పారిశుధ్యం పడకేసింది. డ్రెయినేజీ కాల్వలు పారుదల లేక మురుగు ఎక్కడికక్కడే నిలవడంతోపాటు రోడ్లపైకీ ప్రవహిస్తూ దుర్గంధం వెదజల్లుతోంది. ఈ పరిస్థితి దోమల ఉధృతికి కారణమవుతోంది. కాల్వల్లోని వ్యర్థాలను తీసి పక్కనే పడేయడంతో నిత్యం దుర్గంధం వ్యాపిస్తోంది. ఇప్పటికే గ్రామాల్లో జ్వరాలు ఎక్కువగా ఉన్నాయని, ఇదే కొనసాగితే పరిస్థితి మరింత క్షీణిస్తుందని స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. మరోవైపు కొన్ని ప్రాంతాల్లో డ్రెయినేజీ కాల్వలే లేక అక్కడే మురుగు నిలుస్తోందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇవిఎం చెకింగ్ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్నికలకు ఇవిఎంలు, వివిప్యాట్స్ సిద్ధం చేసేందుకు సోమవారం ఉదయం నుండి ఫస్ట్ లెవెల్ చెకింగ్‌ను బెల్ ఇంజినీర్ల ద్వారా నిర్వహణకు సంబంధించి గుంటూరు ఆర్డీఓ కార్యాలయ ఆవరణలోని ఇవిఎం గోడౌన్ వద్ద చేపట్టిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్‌తో కలిసి శనివారం పరిశీలించారు. ఇవిఎం వివిప్యాట్ల ఫస్ట్ లెవెల్ చెకింగ్ సందర్భంగా పోలీస్ సిబ్బందిని ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తామని కలెక్టర్‌కు ఎస్పీ చెప్పారు. కార్యక్రమంలో డిఆర్ఓ కె.చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, గుంటూరు పశ్చిమ తహశీల్దార్ సాంబశివరావు, డిస్టిక్ ఇన్ఫర్మేటిక్ ఆఫీసర్ బిమల్ కుమార్ పాల్గొన్నారు.

కెఎల్‌యు శాస్త్రవేత్తల బృందాన్ని అభినందిస్తున్న వైస్‌చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారదివర్మ, డీన్ డాక్టర్ జయకుమార్ సింగ్

పరిశోధనలకు కేంద్రబిందువుగా కెఎల్‌యు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

పరిశోధనలకు కేంద్రబిందువుగా కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ అవతరించిందని వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పర్థసారదివర్మ అన్నారు. కేంద్రశాస్త్ర సాంకేతిక శాఖ నుండి రూ.ఏడు కోట్లు మంజూరుకావడమే ఇందుకు నిదర్శనమన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు యూనివర్శిటీలు, ఇంజినీరింగ్ కళాశాలల నుండి శాస్త్రవేత్తలు రూపొందించిన ప్రాజెక్టలను పంపాల్సిందిగా కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ వారు కోరగా దేశవ్యాప్తంగా ఉన్న యూనివర్శిటీలతో పాటు ఎపి, తెలంగాణా రాష్ట్రాల నుండి 13 యూనివర్శిటీలు, పలు ఇంజినీరింగ్ కళాశాలలు తమ విద్యా సంస్థల్లో రూపొందించిన ఆయా ప్రాజెక్టులను పంపారని ఆయన శనివారం తెలిపారు. ఎపి, తెలంగాణా రాష్ట్రాల నుండి కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీకి చెందిన ఆరుగురు శాస్త్రవేత్తల బృందం రూ.ఏడు కోట్ల విలువ చేసే 'పర్స్' అనే ప్రాజెక్ట్‌ను రూపొందించగా దీనికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తల బృందాన్ని ఆయన అభినందించారు. కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ పరిశోధన, అభివృద్ధి డీన్ డాక్టర్ జయకుమార్ సింగ్ మాట్లాడుతూ తమ వర్శిటీలోని ఇసిఇ విభాగం నుండి డాక్టర్ బిటిపి.మాధవ్, డాక్టర్ వివేక్ నాథన్, డాక్టర్ శ్రీనివాస్‌బాబు, డాక్టర్ అరుణ్ మేతా, భౌతికశాస్త్ర విభాగం నుండి డాక్టర్ కె.స్వప్న, డాక్టర్ మెహమూదా అనే శాస్త్రవేత్తలు కలిసి రూపొందించిన 'పర్స్' ప్రాజెక్ట్ వల్ల తమ వద్ద ఇప్పటికే ఉన్న పరిశోధనా కేంద్రాన్ని విస్తృత స్థాయిలో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. శాస్త్రవేత్తల బృందానికి కో-ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ బిటిపి.మాధవ్ మాట్లాడుతూ యాంటినాల రూపకల్పన టెక్నాలజీలో కెఎల్ యూనివర్శిటీ ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఫ్లెక్సిబుల్ ఎక్ట్రానిక్స్ పరికరాలను రూపొందిచడంలో మైక్రో యాంటెనాను రూపొందించడంతో కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ తమ వర్సిటీ శాస్త్రవేత్తల బృందాన్ని అభినందించినట్లు చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో పరిశోధన విద్యార్థులకు ఉపయోగపడేలా పరిశోధన కేంద్రాన్ని అభివృద్ధి చేసేలా తమ బృందానికి బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు. దీంతో కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ రెండు తెలుగు రాష్ట్రాల్లోని పరిశోధనా విద్యార్థుల పరిశోధనలకు కేంద్ర బిందువుగా మారిందన్నారు. గతంలో క్లిష్టమైన పరిశోధనలను, అధునాత పరికరాలపైన చేయడానికి చెన్నై, డిల్లీతోపాటు పాటు అమెరికా వంటి దేశాలకు వెళ్లి పరిశోధన చేసి ఫలితాలు వచ్చాక తిరిగి తమ విద్యా సంస్థలకు విద్యార్థులు తిరిగి వచ్చేవారని, ఇప్పుడు అధునాత పరికరాలన్నీ కెఎల్‌యులోనే ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

ఎమ్‌టిఎంసి కార్యాలయం వద్ద రేపటి ధర్నాకు తరలిరండి : సిపిఎం

ప్రజాశక్తి-తాడేపల్లి

ప్రజా సమస్యల పరిష్కారం కోసం మంగళగిరిలోని ఎంటిఎంసి కార్యాలయం వద్ద సోమవారం చేపట్టే మహాధర్నాకు ప్రజలు తరలిరావాలని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి శనివారం ఒక ప్రకటనలో కోరారు. నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అధికారులకు అర్జీలు ఇవ్వడంతో పాటు రాయభార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో 20 వేల మంది ప్రజలు ఇళ్లస్థలాలు, పట్టాల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాజధానిలో పేదలకు ఇచ్చే సామాజిక పింఛను రూ.2500 నుంచి 5 వేలకు పెంచాలని కోరారు. గ్రామాల్లో తాగునీటి సమస్య, రోడ్లు, డ్రైయినేజీ సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారని తెలిపారు.

సెలవులకు వేరే ఊరెళ్తుంటే చెప్పండి..

పొన్నూరు అర్బన్ సిఐ ఎమ్‌డి కాజా అల్తాఫ్ హుస్సేన్

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

దసరా సెలవులకు ఊరు వెళ్తున్న వారు జాగ్రత్తలు పాటించాలని, ముందుగా పోలీసులకు సమాచారం ఇస్తే నిఘా ఏర్పాటు చేస్తామని పొన్నూరు అర్బన్ సిఐ ఎమ్‌డి కాజా అల్తాఫ్ హుస్సేన్ సూచించారు. ఈ మేరకు శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వేరే మూరు వెళ్లేవారు ఆభరణాలు, నగదును వీలైనంత వరకు బ్యాంకు లాకర్లలో దాచుకోవాలని, లేదా బంధువుల వద్ద పెట్టుకోవాలని సూచించారు. వివిధ మరమ్మతుల పేరుతో వచ్చే అనుమానితులను అపార్టుమెంట్లలోకి అనుమతించొద్దని, కాలనీలలో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని లేదా డయల్ 100కు చెప్పాలని కోరారు. వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్కింగ్ చేసుకోవాలని, ద్విచక్రవాహనాలకు తాళాలు వేయటంతో పాటు వీలైతే చక్రాలకు కూడా చైన్‌లు కూడిన తాళం వేయటం మంచిదన్నారు. సాధ్యమైనంత వరకు ఇళ్ల వద్ద సిసి కెమెరాలు అమర్చుకోవాలని, ఇంటి బయట, ఇంట్లో లైట్లు వేసి ఉంచాలని చెప్పారు. ఆయా కాలనీల సంక్షేమ సంఘాలు రాత్రి వేళల్లో గస్తీని ఏర్పాటు చేసుకుంటే చోరీని అరికట్టొచ్చన్నారు.

తాగునీరు లేకున్నా చోద్యం చూస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు : టిడిపి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణ ప్రజలకు మంచి నీటిని అందించే కృష్ణ వాటర్ ప్లాంట్ మోటర్లు మరమ్మతులకు గురై రెండ్రోజులవుతున్నా అధికారులు బాగు చేయించకపోవడం వల్ల తాగునీటికి ప్రజలు ఇక్కట్లు పడుతున్నారని టిడిపి నాయకులు డాక్టర్ మునగపాటి వెంకటేశ్వరరావు విమర్శించారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని నడిబొడ్డులోనే ప్రజలకు తాగునీరు అందించలేని స్థితిలో ప్రభుత్వం ఉందని, మంగళగిరి పట్టణ ప్రజలతోపాటు ప్రతిరోజు ఈ ప్రాంతాలకు వచ్చే ప్రజల సైతం నీటి వసతి లేక ఇబ్బంది పడుతున్నారని, అసమర్థ ప్రజాప్రతినిధులు, నాయకులు ఇక్కడున్నారని విమర్శించారు. ప్రజలు చెల్లించే డబ్బులతో జీతాలు తీసుకుంటున్న అధికారులు సైతం సమస్యను పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా స్పందించి మరమ్మతులు చేయించాలని కోరారు.

జెకెసిలో భాషా దినోత్సవాలు

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న శ్రీనివాసులు

మహాకవి సుబ్రమణ్య భారతి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఏక్‌భారత్ శ్రేష్ఠభారత్ యుజిసి గతేడాది నుండి నిర్వహిస్తున్న భాషా దినోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక జెకెసి కాలేజీలో 'భాషలు అనేకం-భావం ఒక్కటే' అంశంపై సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గుళ్లపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ పలు అంశాలను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.నాగేశ్వరరావు, పిజి కోర్సుల డైరెక్టర్ ఎస్.ఆర్.కె.ప్రసాద్, ప్రాచ్య భాషా విభాగాధిపతి డాక్టర్ కె.శంకరసాయిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

20న ప్రాంతీయ సదస్సు

ప్రజాశక్తి-అచ్చంపేట

ఎబిసిడి వర్గీకరణ కోరుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన గుంటూరులో జరగనున్న ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయాలని రాష్ట్ర కోకన్వీనర్ తుడుం రమేష్ మాదిగ కోరారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని నియోజకవర్గాల్లో పర్యటనలో భాగంగా శనివారం అచ్చంపేట వచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎబిసిడి వర్గీకరణతో పాటు మాదిగల సమగ్ర అభివృద్ధి, రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో కమిటీలను ఏర్పాటు చేసి యువకులకు ,భావితరాల మాదిగలకు రిజర్వేషన్ ద్వారా ఫలాలు అందించడమే తమ ధ్యేయమన్నారు రమేష్ వెంట మండల గ్రామ కమిటీ అధ్యక్షులు ఆనంద్, టి.రాంబాబు, శ్యాంప్రసాద్, ఎస్.కోటి ఉన్నారు

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి-విజయపురిసౌత్

దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమవుతున్న సందర్భంగా విజయపురిసౌత్ లోని మెయిన్ బజార్,సి టైప్ లోని ఆలయాల్లో అమ్మవారి విగ్రహాలను నెలకొల్పి, మండపాలను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించి శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో జరగనున్నాయి. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నారు

ప్రొఫెసర్ సురేంద్రనాథ్‌ను సన్మానిస్తున్న విజ్ఞాన్ రిజిస్ట్రార్, అధ్యాపకులు

విజ్ఞాన్స్‌లో న్యూ క్రిమినల్ లా బిల్స్‌పై వర్క్‌షాప్

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని, విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లా డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'అస్సెసింగ్ ద న్యూ క్రిమినల్ లా బిల్స్- ఏ క్రిటికల్ అప్రోచ్ టు క్రిమినల్ లా రిఫార్మ్' అంశంపై శనివారం జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ ప్రొఫెసర్ అనూప్ సురేంద్రనాథ్ విద్యార్థులకు భారతీయ న్యాయ సంహిత-2023 (కొత్త శిక్షా బిల్లు), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత-2023 (న్యూ ప్రొసీజర్ బిల్లు), భారతీయ సాక్ష్యా బిల్లు-2023 (న్యూ ఎవిడెన్స్ బిల్లు) ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రభుత్వం ఈ బిల్లులను విప్లవాత్మకమైనదిగా ప్రోత్సహిస్తున్నా నిశితంగా పరిశీలిస్తే చాలా తక్కువ మార్పులు, విస్తరణలు మాత్రమే వెల్లడవుతాయని పేర్కొన్నారు. క్రిమినల్ చట్టాలను సంస్కరించడానికి అనేక ఇతర రంగాలను కూడా చేర్చాలని చెప్పారు. సమస్యను రూపుమాపడంలో చట్టం కీలక పాత్ర పోషిస్తున్నా అది అన్ని సామాజిక సమస్యలను పరిష్కరించదని గుర్తించడం చాలా అవసరమని ఆయన నొక్కి చెప్పారు. పేదరికం, విద్య, సామాజిక అసమానత వంటి సమస్యలను పరిష్కరించడం, నేరాలకు మూల కారణాలపై లోతైన అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, లా డిపార్ట్‌మెంట్ డైరెక్టర్, అధ్యాపక సిబ్బంది, న్యాయవాదులు, న్యాయ నిపుణులు, విద్యావేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో ఇక్కట్లు

ప్రజాశక్తి-వినుకొండ

కరెంటు కోతలు, అడ్డగోలు బిల్లుల మోతలతో జగన్ రికార్డులు సష్టిస్తున్నారని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు విమర్శించారు. వినుకొండ పట్టణంలోని 1వ వార్డ్ కళ్యాణపురి కాలనీ, సీతయ్య నగర్ లో కరెంటు కోతలకు వ్యతిరేకంగా వార్డు ప్రజలు కొవ్వొత్తులతో నిరసన తెలియజేశారు. నిరసన కార్యక్రమాలు పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ అప్రకటిత కరెంటు కోతలతో 1వ వార్డులోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు, ప్రజలు ఉక్కపోతలో జీవి స్తున్నారని అన్నారు. కరెంటు కోతల కారణంగా ప్రజలు అంధకారంలో నివసిస్తూ, దోమల స్వైర విహారంతో జ్వరాల బారినపడి రోగాలకు గురై ప్రజలు అనారోగ్య పాలవుతున్నారని అన్నారు. లోడ్ రిలీఫ్ పేరుతో ఇష్టాను సారంగా విద్యుత్ కోతలు విధిస్తున్నారని, రాష్ట్రంలో విద్యుత్ కోతలు లేని గ్రామం గానీ, నగరం గానీ లేదని అన్నారు. నెల రోజులకు ఒకసారి మీటర్ రీడింగ్ తీసి బిల్లులు ఇవ్వాల్సి ఉం డగా, 40 రోజులు దాటాక బిల్లులు ఇస్తుం డటంతో యూనిట్ చార్జీల స్లాబ్ పెంచి వినియోగదారులను దోచు కుంటున్నారని అన్నారు. ఇలా విని యోగదారులను మోసం చేస్తున్నారని, స్విచ్ వేయకుండానే సీఎం జగన్‌రెడ్డి ప్రజలకు కరెంట్ షాక్ కొట్టిస్తున్నారని విమర్శించారు. జగన్ నాలుగేళ్ల పాలనలో 8 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై 57 వేల కోట్లకు పైగా భారం మోపారని అన్నారు. వినుకొండ లో కరెంటు కోతలు విధిస్తే సహించేది లేదని అన్నారు.

వినుకొండలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న జివి ఆంజనేయులు

డిసిసి ప్రసిడెంట్‌గా మరోసారి..

అలెగ్జాండర్ సుధాకర్ నియామకంపై హర్షం - పలువురు సత్కారం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

డిసిసి పల్నాడు జిల్లా ప్రెసిడెంట్‌గా అలెగ్జాండర్ సుధాకర్ కు మరోసారి అవకాశం లభించింది.పల్నాడు జిల్లా కాంగ్రెస్ డిసిసి ప్రెసిడెంట్‌గా ఏఐసిసి ద్వారా నియమింపబడిన అలెగ్జాండర్ సుధాకర్ తన నియామకానికి సహకరించిన ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, సోనియా గాంధీ,రాహుల్ గాంధీ,పిసిసి అధ్యక్షులు రుద్ర రాజు, కెవిపి రామచంద్రరావు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అలెగ్జాండర్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో కాంగ్రెస్ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. సుధాకర్‌ను జిల్లా లోని ఆయా నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలు, కాంగ్రెస్ నాయకులు రాధాకృష్ణ, చుక్కా చంద్రపాల్, నాగేశ్వరరావు, రామ చంద్రారెడ్డి, యలమందారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ కృష్ణ, మైనారిటీ సెల్ నాయకులు బాషా, లీగల్ సెల్ నాయక^లు మొండి తోక ప్రసన్న, రొంపిచర్ల మండల అధ్యక్షులు శ్రీను, పల్నాడు జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు నాగేంద్ర, మాబుజానీ, రమేష్ పాల్గొన్నారు.

అలెగ్జాండర్ సుధాకర్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పోలియో బాధితునికి ట్రై సైకిల్ అందజేత

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఆత్మకూరుకి చెందిన మేడా రామాంజనేయులుకు పోలియో సోకి రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. భార్య జయ కూడా పోలియోతో బాధ పడుతోంది. రామాంజనేయులు దీన స్థితిని తెలుసుకున్న కృష్ణా జిల్లాకు చెందిన బొప్పన రాధా హైదరాబాదు నుండి ట్రై సైకిల్ ను పంపారు. ఈ ట్రై సైకిల్ ను పల్లె శ్రీను అనే వ్యక్తి ద్వారా శనివారం ఆత్మకూరులోని పోలియో బాధితుడు రామాంజనేయులు కు అందజేయించారు. స్మార్ట్ ఫోన్ వీడియో కాల్ ద్వారా బాధితుడు రామాంజనేయులు ట్రై సైకిల్ అందుకునే దృశ్యాలను రాధా వీక్షించారు. కుటుంబ పోషణ నిమిత్తం బడ్డీ కొట్టు నిర్వహణ ద్వారా విక్రయించుకునేందుకు సరుకులను అంద జేయించారు. అధైర్య పడవద్దని బొప్పన రాధ బాధితులకు భరోసా ఇచ్చారు. నడవలేని స్థితిలో ఉన్నప్పటికీ,బొప్పన రాదా తనలా ఇబ్బంది పడే వారికి ట్రై సైకిళ్లు వీల్ చైర్లు అందజేయించి ఆదుకుంటున్నారు. సొంతంగా చీరల వ్యాపారం చేస్తూ వచ్చిన ఆదాయాన్ని దివ్యాంగులను ఆదుకునేందుకు వెచ్చిస్తున్నారు. ఇప్పటి వరకు రెండు తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 1100 ట్రైసైకిళ్ల వీల్ చైర్స్ అందజేయించారు.

కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి-తాడేపల్లి

కనకదుర్గ వారధి సమీపంలో విజయవాడ క్లబ్, కృష్ణానది పరివాహక ప్రాంతంలో తాడేపల్లి సిఐ శేషగిరిరావు ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్‌పి హఫీజ్ ఆదేశాల మేరకు 40 మంది సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. కృష్ణానదిలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న పది మందిని అదుపులోకి తీసుకున్నారు. పలువురు అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ద్విచక్ర వాహనాల రికార్డులను పరిశీలించారు. అపరచిత వ్యక్తుల కదలికలపై సమాచారం ఇవ్వాలని స్థానికులను కోరారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు వినోద్, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కేన్సర్ బాధితులకు చేయూతనివ్వండి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కేన్సర్ బారిన పడి చివరి దశలో ఉన్న వారికి సంతోషకర జీవితం అందించేందుకు వాలంటీర్లు పని చేయాలనీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. శనివారం నాట్కో కేంద్రం లో ప్రపంచ ఉపశమన సంరక్షణ దినోత్సవం (పాలియేటివ్ కేర్ డే) పురస్కరించుకుని వివిధ విభాగల వైద్యులు, నర్సులు, నర్సింగ్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం లో ఆయన మాట్లాడారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ తో బాధ పడే వారికీ ఆరోగ్య సంరక్షణ సంస్థలు ముందుకు రావాలని సూచించారు. అనారోగ్యం తో బాధ పడే రోగులకు ప్రేమ తో వైద్యం అందించాలని ఆయన కోరారు. ప్రాణంతక వ్యాధుల బారిన పడిన వారిని బాధితులకు ఉపశమనం కల్పించేందుకు కషి చేయాలనీ ఆయన చెప్పారు. ఆసుపత్రి కి రాలేని వారి ఇంటికి వెళ్లి సేవలు అందించాలన్నారు. ఆఖరి మజిలీ లో రోగులకు ఎంత సేవా చేసిన సరిపోదన్నారు. అందుకోసం డాక్టర్ జోజిరెడ్డి కుటుంబ సభ్యులు రూ.13 లక్షల వ్యయం గల వాహనాన్ని అందుబాటులో ఉంచడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా జోజిరెడ్డి సతీమణి డాక్టర్ జ్యోతిని ఘనంగా సన్మానించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి టి కె రెడ్డి, డాక్టర్ దుర్గ ప్రసాద్, నాట్కో కోఆర్డినేటర్ వై.అశోక్ కుమార్ ప్రసంగించారు. డా. జోజీ రెడ్డి భార్య డాక్టర్ జ్యోతిని ఘనంగా సత్కరించారు. అనస్థీషియా ప్రొఫెసర్ డాక్టర్ పోలయ్య , డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, డాక్టరు జాహ్నవి , డాక్టర్ వెంకారెడ్డి , డాక్టర్ మాధురి , డాక్టర్ శ్రీకన్య మానవత సేవా సంస్థ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాంతక వ్యాధిగ్రస్తుల ఇళ్లకే మందులు

ప్రాణంతక వ్యాధి బారిన పడిన బాధితులకు నెల కు సరిపడా మందులు ఇంటికే పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ ఆదేశించారు.శనివారం ఆసుపత్రి సుశృత హాలులో వై ఆర్ జి కేర్, జిజిహెచ్ ఏ ఆర్ టి సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో అమ్మ ట్రస్ట్, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు, మానవతా సేవా సమితి సహకారం తో చిన్నారులకు పౌష్టిక ఆహార కిట్ల పంపిణి కార్యక్రమం లో ఆయన మాట్లాడారు. మందుల కోసం వయో వద్దులు, చిన్నారుల తల్లితండ్రులు డబ్బులు ఖర్చు పెట్టుకుని దూర ప్రాంతాల నుంచి ఆసుపత్రి కి రావడం కష్ట తరంగా ఉంటుందని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంటికి వైద్యం అందిస్తుంటే వ్యాధిగ్రస్తులకు కూడా నేరుగా మందులు అందించే విధంగా కృషి చేయాలని ఆయన అన్నారు. ఏ ఆర్ టి ఉద్యోగులు అంబులెన్స్ లో వెళ్లి వ్యాధిగ్రస్తులకు మందులను అందించాలని అందుకు అవసరమైన సహకారాన్ని అందిస్తామని ఆయన తెలిపారు. అనంతరం 60 మంది చిన్నారులకు పౌష్టిక ఆహార కిట్లను డాక్టర్ కిరణ్ కుమార్ అందచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సూప రింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అధ్యక్ష కార్యదర్సులు కె వి భాస్కర్, చెరుకూరి శ్రీనివాస రావు, దుర్గా, ముస్తఫా పాల్గొన్నారు.

డాక్టర్ జ్యోతిని సత్కరిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

నీళ్లు అందక వరి పొలంలో బీటలు

దెబ్బతింటున్న పైరును రాజేంద్రప్రసాద్‌కు చూపుతున్న రైతు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

వరిపైరు పొట్టదశలో ఉందని, ఈ క్రమంలో పొలాలకు నీరందక రైతులు లబోదిబోమంటున్నారని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని హాఫ్‌పేట, నంబూరు డొంక, కొలకలూరు గ్రామాల్లో ఎండిపోయిన పొలాలను టిడిపి, జనసేన నాయకులతో కలిసి రాజేంద్రప్రసాద్ శనివారం పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ బీడుబారి నెర్రులిచ్చిన పొలాలకు సాగునీరు అందించాలని అధికారులకు ఈనెల 11న ఓరామని, అయినా ఇంకా స్పందించలేదని అన్నారు. హై లెవెల్ ఛానల్ ఈస్ట్ పరిధిలో 4 వేలు ఎకరాలు ఉండగా ఆయా పొలాలకు నీరు సకాలంలో అందడం లేదన్నారు. హాఫ్‌పేట, కొలకలూరు, ఖాజీపేట పరిధిలో సుమారు 1000-1500 ఎకరాల్లో పైరు ఎండిపోయిందని, అధికారులు స్పందించి బకింగ్ హాం ఛానల్ ద్వారా నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏడెనిమిది వేల క్యూసెక్కులను కృష్ణా పశ్చిమ డెల్టాకు విడుదల చేస్తే రైతుల కొష్టాలు కొంతైనా తీరతాయని చెప్పారు. నీటి సమస్య వలన ఎకరాకు రూ.1600 అదనంగా రైతులకు ఖర్చవుతోందని, దీంతోపాటు విద్యుత్ కోతలతో రైతుల పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావని అన్నారు. నష్టపోతున్న వారిలో ఎక్కువగా కౌలురైతులేనని, కంకులు రావాల్సిన పొలాల్లో గడ్డిపూలు మొలవడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తుందని తెలిపారు. మరోవైపు రైతుల సమస్యలు పట్టని వైసిపి నాయకులు పథకాల ప్రచారంలో తనమునకలై ఉన్నారని విమర్శించారు. రైతుల సమస్యలను పరిష్కరించకుంటే టిడిపి, జనసేన కలిసి రాస్తారోకోలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

మా గోడు ఎవరికీ పట్టడం లేదు

భాస్కరరావు, కౌలు రైతు, హాఫ్‌పేట

అప్పులు చేసి 15 ఎకరాలు కౌలుకు తీసుకున్నాం. ఎకరాకు రూ.50 వేలు పెట్టుబడి పెట్టాను. వాన కోసం ఎదురుచూశాం. కనీసం కాల్వలు ద్వారానైనా సాగునీరు అందుతుందని ఆశపడ్డాం. ఏ ఫలితమూ లేదు. మా గోడు ఎవరికీ పట్టడం లేదు. మోర్టార్లు, నీళ్ల ట్యూబులు కోసం రూ.2 వేలు అదనపు ఖర్చవుతోంది. పంట చేతికొచ్చేలా ప్రభుత్వం ఆదుకోవడంతోపాటు.. ఇప్పటికే జరిగిన నష్టానికి పరిహారంగా ఆర్థిక సాయం చేయాలి.

ఎండిపోయిన పైరును చూపుతున్న రైతు

సాగునీరు ఎందుకివ్వడం లేదో సమాధానం చెప్పాలి

ప్రజాశక్తి - చేబ్రోలు

పొలాలకు సాగునీరు అందర రైతులు విలపిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే డి.నరేంద్రకుమార్ విమర్శించారు. మండలంలోని సుద్దపల్లి, శలపాడు గ్రామాల్లో పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఒకపక్క ఇబ్బంది పడుతుంటే మరోవైపు సంక్షేమ పథకాల్లో దోపిడీ ఎలా చేయాలోనని సిఎం ఆలోచిస్తున్నారని అన్నారు. సాగునీరు ఎందుకివ్వడం లేదో రైతులకు ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ఇప్పటికైనా స్పందించకుంటే నీటిపారుదల శాఖ కార్యాలయాలను ముట్టడికి పిలుపునిస్తామని హెచ్చరించారు. పరిశీలనలో టిడిపి మండల అధ్యక్షులు ఎం.వెంకటరామ రాజు, నాయకులు లక్ష్మినారాయణ, జ్యోతి కుమార్, వెంకటసుబ్బయ్య, బసవ శివశంకర్‌రావు పాల్గొన్నారు.

రేపు జిఎంసి ఎంప్లాయిస్ గ్రీవెన్స్

ప్రజాశక్తి-గుంటూరు

జిఎంసి పరిధిలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రేపు మధ్యాహ్నం 3 నుండి 4 గంటల వరకు జిఎంసి ప్రధాన కార్యాలయంలో ఎంప్లాయిస్ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఒక ప్రకటనలో తెలిపారు. జిఎంసి ఉద్యోగులు తమ సర్వీస్‌కి సంబంధించిన సమస్యల పరిష్కారానికి అర్జీలు అందించవచ్చన్నారు. గ్రీవెన్స్‌లో ఆయా విభాగాధిపతులు, డిప్యూటీ కమిషనర్లు పాల్గొంటారని, నగరపాలక పరిధిలోని వార్డు సచివాలయ కార్యదర్శులు, మినిస్టీరియల్ సిబ్బంది, తమ విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు, సర్వీస్‌కు సంబంధించిన సమస్యలపై అర్జీలు అందించవచ్చని తెలిపారు.

నేటి నుండి శరన్నవరాత్రి మహోత్సవాలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆదివారం నుంచి 25వ తేదీ వరకు శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు జరుగుతాయని దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ నేరేళ్ల లక్ష్మీ రాధిక శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం శ్రీ బాల త్రిపుర సుందరి అలంకారము, 16న శ్రీ గజలక్ష్మి, 17న శ్రీ దురాదేవి, 18న శ్రీ ధనలక్ష్మి, 19న శ్రీ రాజరాజేశ్వరి దేవి, 20న శ్రీ గాయత్రీ దేవి, 21న శ్రీ సరస్వతి దేవి, 22న శ్రీ కాళీ కాళికాదేవి, 23 శ్రీ మహిషాసుర మర్దని, 24న విజయ దశమి శమీ పూజ, పుష్ప శయ్య అలంకారాలు, 25న శ్రీ స్వామి వారి పారువేట ఉత్సవం ఉంటాయని పేర్కొన్నారు.

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్

పెదకాకాని శ్రీమల్లేశ్వర దేవస్థానంలో శనివారం మహాలయ అమావాస్య సందర్భంగా సందర్శకులు రాహు కేతు పూజలు జరిపించుకున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ ఎం.శ్రీనివాసరెడ్డి, చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు తెలిపారు. సందర్శకులకు ఇబ్బందులు రాకుండా ప్రత్యేక షామియానాలు, తాగునీరు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 973 రాహు కేతు పూజ టిక్కెట్లు భక్తులకు విక్రయించగా దేవస్థానానికి రూ.4,86,500 ఆదాయం సమకూరిందని తెలిపారు. అన్నప్రసాద వితరణకు పెద్ది సూరి ప్రకాష్, దుర్గమ్మ దంపతులు విరాళం ఇచ్చారని చెప్పారు. ఇదిలా ఉండగా దసరా ఉత్సవాల నిర్వహణ కోసం ప్రత్యే ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు. దసరా ఉత్సవాల్లో 9 రోజులు చండీ హోమాలు నిర్వహిస్తారని, 20న మూల నక్షత్రం సందర్భంగా శ్రీ భ్రమరాంబ అమ్మవారికి సరస్వతి దేవి అలంకారము చేసి బాలలకు ఉచితంగా అక్షరాభ్యాసం చేయిస్తామని చెప్పారు.

525 మందికి వైద్య పరీక్షలు

వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు, పరిశీలిస్తున్న లావు రత్తయ్య తదితరులు

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

గ్రామీణ ప్రాంతమైన పెదనందిపాడులో ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేసి కార్పొరేట్ స్థాయి చికిత్సను ప్రజలకుకు అందజేయడం హర్షణీయమని విజ్ఞాన్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. శనివారం స్థానిక అశోక్ హైస్కూల్లో పెదనందిపాడు రోటరీ క్లబ్, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో విశ్రాంత సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ లావు నాగేశ్వరరావు సౌజన్యంతో కాటూరి మెడికల్ కాలేజీ, హాస్పిటల్ ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని డాక్టర్ లావు రత్తయ్య శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ ఆసుపత్రిలో వేలాది రూపాయలు తీసుకొని చేసే పరీక్షలు ఈ వైద్య శిబిరంలో ఉచితంగా చేసి వెంటనే రిపోర్టులు ఇవ్వడం మంచి విషయమన్నారు. శిబిరంలో 525 మందికి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా లావు రత్తయ్యను క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వై.కోదండరామిరెడ్డి, వై.రమణయ్య సత్కరించారు. కార్యక్రమంలో లావు తిరుమల ప్రసాదు, ఎన్.వి.ఎస్ నాగేశ్వరరావు, జిల్లా అక్షరాస్యతా చైర్మన్ పోపూరి లక్ష్మీనారాయణ, వరప్రసాద్, నర్రా బాలకృష్ణచ అరవపల్లి కృష్ణ, దాసరి శేషగిరిరావు, పోపూరి నాగేశ్వరరావు, గూడూరు వీరయ్య చౌదరి, కోడూరి నాగేశ్వరరావు, ఎన్.శివప్రసాద్, కుర్రా హరిబాబు, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక లావు వారి చెరువు చుట్టూ మొక్కలను నాటే కార్యక్రమంలో డాక్టర్ లావు రత్తయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయుష్మాన్ భవ వైద్య సేవలు

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

స్థానిక నిడుబ్రోలు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆరోగ్య మేళా నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు 200 మందికి ప్రత్యేక వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిహెచ్‌సి అభివృద్ధి కమిటీ సభ్యులు కె.శ్రీనివాసరావు, డాక్టర్లు రేష్మ, రాంబాబు, ప్రియదర్శిని, రేణుక, రెహమత్, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రకళ పీజీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని చంద్రకళ పిజి కళాశాల్లో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. 2023-24 విద్యాసంవత్సరానికి గాను ఎంసిఎలో చేరిన విద్యార్థులను సీనియర్స్ స్వాగతిస్తూ వేడుకలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జెఎన్‌వి నరేష్‌బాబు మాట్లాడుతూ సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు తమ భవిష్యత్తును తీర్చి దిద్దుకోవాలని, క్రమశిక్షణతో రాణించాలని సూచించారు. ఎన్‌ఆర్‌కె అండ్ కెఎస్‌ఆర్ గుప్తా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గోగినేని విజయకృష్ణ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఎడ్యుకేషనల్ సొసైటీ పరిధిలోని విద్యాసంస్థలు విద్యతో పాటు ఉపాధి అవకాశాలు మెండుగా కల్పిస్తున్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో పొట్టిశ్రీరాములు విద్యాసంస్థల మేనేజర్ డి.శ్రీనివాసరావు, అధ్యాపకులు జి.భారతి, సిబ్బంది పాల్గొన్నారు.

నూతనవస్త్రాలు బహూకరిస్తున్న దాతలు

ఆశ్రమంలో వృద్ధులకు వస్త్రాలు బహూకరణ

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మాగాంధీ సేవాశాంతి ఆశ్రమంలో వృద్ధులకు శనివారం నూతన వస్త్రాలను బహూకరించారు. కొల్లిపర మండలం చక్రాయపాలేనికి చెందిన సర్వేయర్ కొరగంజి నాగేశ్వరరావు వారి పూర్వీకులు అలా గోపాలస్వామి, సుబ్బారావు, పద్మావతి జ్ఞాపకార్థం వీటిని సమకూర్చారు. ఆశ్రమం నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి మాట్లాడుతూ వృద్ధులపట్ల సేవాభావం కలిగి ఉండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కె.వెంకటేశ్వరరావు, వై.కోటేశ్వరరావు, సిహెచ్ లోకనాథం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు, ధ్రువపత్రాలను అందిస్తున్న నాయకులు

కుట్టు మిషన్లు పంపిణి

ప్రజాశక్తి-మంగళగిరి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సహకారంతో స్త్రీ శక్తి పథకంలో శిక్షణ పొందిన 60 మంది మహిళలకు శనివారం మంగళగిరి నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ధ్రువపత్రాలనూ అందజేశారు. కార్యక్రమంలో తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షులు ఎ.భూలక్ష్మి, నాయకులు టి.జానకిదేవి, వి.ఆశాబాల, ఎం.వైష్ణవి పాల్గొన్నారు.

కవయిత్రి బేబీశ్రీ మృతికి సంతాపం

ప్రజాశక్తి-మంగళగిరి

కవయిత్రి నల్లమోతు బేబీశ్రీ మృతికి మంగళగిరి చైతన్య వీవర్స్ అసోసియేషన్ సభ్యులు జి.ధనుంజయరావు, ఎ.తాతా రావు, జి.శ్రీమన్నారాయణ, ఏడుకొండలు సంతాపం ప్రకటించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పొలం వివాదం పరిష్కారం

ప్రజాశక్తి - చేబ్రోలు

పొలంలోని నీటి విషయంలో ఏర్పడిన వివాదాన్ని పరిష్కరించినట్లు తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ తెలిపారు. తమ పొలంలోని వర్షపు నీటిని బయటకు పంపే అంశమై తమ పక్క పొలాల వారితో వివాదం తలెత్తిందని మండలంలోని సుద్దపల్లికి చెందిన తాళ్ల వెంకటసుబ్బమ్మ, తాడిబోయిన శ్రీనివాసరావు స్పందనలో ఫిర్యాదు చేయగా వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించామని, రైతులు మైలా తిరుపతి స్వామి భూమి నుంచి నీటిని కాల్వలకు పంపేలా అంగీకరింపజేశానమి చెప్పారు. ఈ మేరకు ప్రక్క పొలం రైతులు మైలా శ్రీను, మైలా తిరుపతి స్వామి అంగీకరించారని చెప్పారు.

పొలం వద్ద రైతులతో మాట్లాడుతున్న తహశీల్దార్

గుంటూరులో ప్రజాబ్యాలెట్‌లో

అడ్డగోలుగా కరెంటు ఛార్జీల పెంపు

- వామపక్షాల నాయకుల ఆగ్రహం
- గుంటూరు, మంగళగిరిలో ప్రజాబ్యాలెట్ నిర్వహణ
- వ్యతిరేకిస్తూ ఓట్లేసిన ప్రజలు

ప్రజాశక్తి-గుంటూరు

కరెంటు ఛార్జీలు అడ్డగోలుగా పెంచుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు ప్రజలపై పెనుభారం మోపుతున్నాయని సిపిఎం, సిపిఐ నగర కార్యదర్శులు కె.నళినీకాంత్, కె.మాల్యాద్రి అన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపును నిరశిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో స్థానిక గుజ్జనగుండ్ల సెంటర్‌లో ప్రజాబ్యాలెట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ అడుగులకు మడుగులు ఒత్తుతూ, కేంద్రం చేస్తున్న నిర్ణయాలను అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నెలనెలా కరెంటు ఛార్జీలు పెంచుతోందని విమర్శించారు. వినియోగించిన కరెంటుకు వసూలు చేస్తున్న బిల్లులే కాకుండా, ఫిక్స్ చార్జీలు, కస్టమర్ చార్జీలు, సర్ చార్జీలు, విద్యుత్ సుంకం, ఇంధనం చార్జీలు, సర్దుబాటు చార్జీలు ఇలా రకరకాల పేర్లు పెట్టి జనాన్ని పీల్చి పిప్పి చేస్తున్నారని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు తిరుగుబాటు సమయం ఆసన్నమైందన్నారు. గత ప్రభుత్వాలు కరెంటు చార్జీల పెంచడం ద్వారా అధికారాన్ని దూరం చేసిన ఈ ప్రజలు ఇప్పుడు ఉన్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి సంసిద్ధమవుతున్నారని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎస్.హనుమంత్‌రెడ్డి, ఎన్.చిన్న, పి.శివాజీ, కె.రంగారెడ్డి, సిపిఎం నాయకులు షేక్ ఖాశిం షహీద్, ఆది నికల్సన్, షేక్ బాషా, షేక్ ఖాశింవలి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్తు ఛార్జీలతో సామాన్యుల నడ్డి విరుస్తున్నాయని, బిల్లులు చూడగానే ప్రజలకు షాక్ కొడుతోందని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య అన్నారు. విద్యుత్ చార్జీల భారాన్ని వ్యతిరేకిస్తూ సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎంఎల్) తదితర వామపక్షాల ఆధ్వర్యంలో స్థానిక మిద్దె సెంటర్లో శనివారం ప్రజా బ్యాలెట్ నిర్వహించారు. ఈ సందర్భంగా చెంగయ్య మాట్లాడుతూ రెండు గంటల పాటు నిర్వహించిన కార్యక్రమంలో 210 ఓట్లు పోలవ్వగా 209 ఓట్లు కరెంట్ చార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా వచ్చినట్లు వెల్లడించారు. రూ.500-600 కరెంటు బిల్లును ప్రజలు ఎలా కట్టగలరంటూ ఎన్నికలప్పుడు ప్రతిపక్ష నేతగా ప్రశ్నించిన జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు సర్దుబాటు ఛార్జీలు, స్మార్ట్ మీటర్ల పేరుతో భారీగా భరాలు వేస్తున్నారని విమర్శించారు. విద్యుత్ రంగాన్ని బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబట్టేందుకు చూస్తున్నారని, రాష్ట్రాన్ని అదానీలాంటి కార్పొరేటర్లకు తాకట్టు పెడుతూ ప్రజలపై పెనుబారాల మోపుతున్నారని, ఆ కంపెనీలతో కుమ్మక్కై విద్యుత్‌ను యూనిట్ బహిరంగ మార్కెట్లో రూ.10 నుండి రూ.20కు కొంటున్నారని దుయ్యబట్టారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్నితిరుపతయ్య మాట్లాడుతూ 200 యూనిట్లులోపు విద్యుత్ వాడే వారందరికీ ఉచిత విద్యుత్‌ను ఇస్తామని చెప్పిన జగన్ మోసం చేస్తున్నారని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ క్రమంగా నీరుగారుస్తున్నారని, చిరు వ్యాపారులకు విపరీతంగా రేట్లు పెంచారని, వ్యాపార సంస్థలు పరిశ్రమలపై భారం పెరిగిందని అన్నారు. ఈ భారాలను రద్దు చేయకుంటే వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు వై.వెంకటేశ్వరరావు, ఎ.ప్రభాకర్, ఎన్.బ్రహ్మేశ్వరరావు, పి.నాగేశ్వరరావు, జె.జాన్‌బాబు, జె.సాంబశివరావు, జి.సాంబిరెడ్డి, చిన్ని సత్యనారాయణ, ఎస్‌కె.కరీముల్లా, బి.శ్రీనివాసరావు, వై.శివగోపి, ఎం.అభిషేక్, ఎ.హనోక్‌బాబు, సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, పి.బాలకృష్ణ, ఎం.ఫకీరయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి వై.కమలాకర్, నాయకులు ఎం.బాలాజీ, ఎం.చలపతిరావు, డి.రామారావు, సిపిఐ (ఎంఎల్) నాయకులు కె.కోటేశ్వరరావు, ఆదినారాయణ, దుర్గాప్రసాద్, అంజిరెడ్డి, భాస్కరరావు పాల్గొన్నారు.

మంగళగిరిలో ప్రజాబ్యాలెట్ ద్వారా వచ్చిన ఓట్లను లెక్కిస్తున్న నాయకులు

యుటిఎఫ్ రాష్ట్ర మహిళా కన్వెన్షన్‌కు వెళ్లిన గుంటూరు జిల్లా బృందం

ప్రజాశక్తి - గుంటూరు

తిరుపతిలో ఆదివారం నిర్వహించే యుటిఎఫ్ రాష్ట్ర మహిళా కన్వెన్షన్‌కు గుంటూరు జిల్లా నుండి బృందం శనివారం రాత్రి బయలుదేరి వెళ్లింది. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.ఆదిలక్ష్మి, సహాధ్యక్షులు ఎఎల్ శివపార్వతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయినులతో బయలుదేరిన బస్సును యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐదో రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి : ఆశ వర్కర్ కృపమ్మ మృతికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని సిఐటియు ఆధ్వర్యంలో తాడేపల్లిలో చేపట్టిన దీక్షలు శనివారానికి ఐదోరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కృపమ్మ మృతికి అధికారులే కారణమని విమర్శించారు. ప్రభుత్వం హామీనిచ్చిన విధంగా ఇంటి స్థలం, ఇంటి నిర్మాణంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.లక్ష్మి, రేణుక, సుమతి, సుగుణ, వి.లక్ష్మి, కరుణ, వినోదిని, విజయలక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

డిఆర్ఎం కప్ పోటీలు నేడు ముగింపు

ప్రజాశక్తి-గుంటూరు : డిఆర్ఎం కప్ క్రీడలు నేటితో ముగియనున్నాయి. శనివారం పలు టీముల మధ్య స్థానిక నల్లపాడు రైల్వే గ్రౌండ్స్‌లో క్రికెట్ పోటీలు కొనసాగాయి. డిఆర్ఎం -11 స్ట్రైకర్స్ జిఎంసి జట్ల మధ్య జరిగిన పోటీలో డిఆర్ఎం జట్టు 27 రన్స్‌తో గెలిచింది. పల్నాడు పోలీసు-11 స్ట్రైకర్స్ జిఎంసి మధ్య పోటీలో పల్నాడు పోలీసు టీం 12 రన్స్ తేడాతో గెలిచింది. డిఆర్ఎం - పల్నాడు పోలీసు మధ్య జరిగిన పోటీలో డిఆర్ఎం టీమ్ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. డిఆర్ఎం-పల్నాడు పోలీసు జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది. క్రికెట్‌తోపాటు, షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు ప్రదానం చేయనున్నారు.

వివిఐటిలో ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్

వివిఐటి కళాశాలలో నూతనంగా ప్రవేశాలు పొందిన మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ శనివారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలు ఉత్సహంగా సాగాయి. ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ ఉత్తమమైన చదువు, ఉపాధితో పాటు మధుర స్మృతులను కాలేజీ అందిస్తున్నారు. క్రమశిక్షణ, విలువలతో విద్యార్థులను ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్లు డాక్టర్ కె.గిరిబాబు, డాక్టర్ ఎన్.కుమారస్వామి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్నికలపై వైసిపి నేతల దృష్టి

7 వీక్షణం

సార్వత్రిక ఎన్నికలకు దాదాపు ఆరు నెలల సమయం ఉన్నా ఎన్నికల వ్యూహం రూపొందించడంపై వైసిపి నాయకత్వం వేగం పెంచింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈ మేరకు పార్టీ ఎమ్మెల్యేలు, యోజకవర్గ ఇన్‌ఛార్జిలు, ప్రాంతీయ సమన్వయకర్తలకు పలు బాధ్యతలు అప్పగించారు. ఎన్నికల నిర్వహణ (పోల్ మేనేజ్‌మెంట్)ను సమర్ధవంతంగా నిర్వహించేందుకు తగిన యంత్రాంగాన్ని రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలకు, ఎమ్మెల్యేలకు పార్టీ అధిష్టానం కొత్త బాధ్యతలు అప్పగించింది. ప్రధానంగా వాలంటీర్లు, గృహసారథులు, వైసిపి నాయకుల ద్వారా క్షేత్ర స్థాయిలో వివరాల సేకరణపై దృష్టి సారించాలని సూచించారు. ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గంలో మండలాల వారీగా వివిధ సామాజిక తరగతుల ఓటర్ల వివరాలు, ప్రధాన సామాజిక తరగతికి చెందిన ముఖ్యమైన నాయకుల వివరాలు, వారు ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా ఉన్నారు? వారి ప్రభావం అభ్యర్థుల విజయానికి ఏ మేరకు దోహద పడగలదు? అనే అంశాలతోపాటు ఈ నాయకులను అనుసరిస్తున్న వారి వివరాలను సేకరించాలని పార్టీ నాయకత్వానికి పంపాలని పార్టీ అధిష్టానం ఆదేశించింది. ఈ మేరకు గ్రామాలు, పట్టణాల నుంచి వివరాల సేకరణకు కసరత్తు జరుగుతోంది. ప్రధానంగా గత ఎన్నికల్లో తమకు ఓట్లు వేసిన సామాజిక తరగతుల్లో ఈసారి అసంతృప్తిగా ఉన్న వారు, వ్యతిరేకిస్తున్న వారు, అందుకు గల కారణాలను అధ్యయనం చేయాలని ఎమ్మెల్యేలకు సూచించారు.

గుంటూరు లోక్‌సభ పరిధిలో ఎక్కువ మంది అభ్యర్థులను మార్చాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలిసింది. ఇందుకోసం వివిధ దశల్లో సర్వే చేస్తున్నారు. మొత్తం ఏడు సంస్థల ద్వారా వేర్వేరుగా సిఎం నివేదికలు తెప్పించుకుంటున్నారని ఈ ఏడు సంస్థల్లో ఒకే అభిప్రాయం వచ్చిన వారికి చెక్ పెడతారని పార్టీ సీనియర్ నాయకుడొకరు చెప్పారు. పోల్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ప్రధానంగా కొన్ని సామాజిక తరగతుల వారు పార్టీకి దూరమయ్యారనే సమాచారం మేరకు అందుకు గల కారణాలను తెలుసుకోవాలని అధిష్టానం నిర్ణయించింది. సామాజిక తరగతుల వారిగా ప్రభావం చూపే నాయకులను ఇప్పటి నుంచి తమ వైపునకు తిప్పుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్లో నెలకొన్న అసంతృప్తులను చల్లార్చడానికి ముందస్తు ప్రయత్నాలు చేయాలని, అవసరమైతే జిల్లాకు చెందిన మంత్రులు, ఇతర అగ్రనాయకుల ద్వారా హామీలు ఇప్పించాలని సూచించారు. ఇప్పటికే వ్యతిరేకిస్తున్న తరగతుల వారికి కూడా అందుతున్న సంక్షేమ పథకాలు, గత ఐదేళ్లలో జరిగిన లబ్ధి వివరాలు వివరించి వ్యతిరేకత శాతాన్ని తగ్గించుకోవాలని నిర్ణయించారు. ప్రధానంగా వైద్యరంగంపై దృష్టి పెట్టడం ద్వారా పేదల్లో ఎంతోకొంత సానుకూలమైన పరిస్థితిని మెరుగుపర్చుకోవాలని తలపెట్టారు. ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా వైద్య సేవలు కొంతమేరకు క్షేత్రస్థాయిలో అందుతుండగా ఈ సేవలను మరింత విస్తృత పరిచేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహించాలని నిర్ణయించారు. గత 15 రోజులుగా ఆరోగ్య సురక్ష సభలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. పేదలకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వం సమర్ధవంతంగా పనిచేస్తుందనే ప్రచారం ఉధృతం చేశారు.

(ఎ.వి.డి.శర్మ)